

RNI NO: APTEL/25/A4894

ఉషశ్రీ
USHASRI తెలుగు దినపత్రిక

RNI NO: APTEL/25/A4894
ఉషశ్రీ USHASRI తెలుగు దినపత్రిక
సమస్యలతో ఒంటరిగా పోరాడకండి.
సమాచారం - సహకారం -
పరిస్కారం ఒకే చోట సంప్రదించండి
9295003377

సంపుటి : 01 | సంచిక : 83 | విజయవాడ | ఎడిటర్ : ఇలిపిళ్ల మోహన్ | బుధవారం 03 - 06 - 2026 | పేజీలు : 08 | వెల : రూ.2/-

Published From : Visakhapatnam Vijayawada Guntur Tirupati Kurnool Nellore Rajahmundry Kakinada Anantapur Kadapa Eluru Ongole Srikakulam Vizianagaram Machilipatnam Chittoor

నేను కూడా పాల్గొంటాను

జూన్ 25 నుంచి 45 రోజుల ఇంటింటి ప్రచారం పిలుపు

- సైకిల్‌పై ప్రజలను కలవాలని చంద్రబాబు నిర్ణయం
- "సైకిల్ పవర్" నినాదంతో భారీ ప్రచారం
- అభివృద్ధి, సంక్షేమం ప్రజలకు వివరించాలని సూచన
- కేంద్ర-రాష్ట్ర విజయాలపై విస్తృత ప్రచారం ఆదేశం
- కార్యకర్తల సంక్షేమమే పార్టీకి ముఖ్యమని స్పష్టం
- కొత్త ఎమ్మెల్యేలు మళ్లీ గెలవాలని హితవు
- క్యారెక్టర్, ట్రస్ట్ నాయకులకు కీలకమని సూచన



ఆంధ్రప్రదేశ్, ఉష శ్రీ

తెలుగుదేశం పార్టీ శ్రేణులు జూన్ 25 నుంచి ఆగస్టు 10 వరకు 45 రోజుల పాటు పెద్ద ఎత్తున ప్రజల్లోకి వెళ్లాలని ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు పిలుపునిచ్చారు. "సైకిల్ పవర్ చూపుదాం... ప్రజలకు చేరువవుదాం" అనే నినాదంతో ఇంటింటి ప్రచారం చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. ఈ ప్రచారంలో తాను కూడా పాల్గొంటానని, సైకిల్‌పైనే ప్రజలను కలుస్తానని ఆయన ప్రకటించారు. మంగళవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)పై జరిగిన రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌లో చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండేళ్లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు.

సైకిల్ పవర్ చూపుదాం.. ప్రజలకు చేరువవుదాం: ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు భారీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలని చంద్రబాబు సూచించారు. "జూన్ 25 నుంచి ఆగస్టు 10 వరకు, 45 రోజుల పాటు ఇంటింటి ప్రచారం చేపట్టాలి. రెండేళ్లలో ప్రభుత్వం సాధించిన ప్రగతిని ప్రతి గడపకు వివరించాలి. ఈ ప్రచారంలో భాగంగా సైకిళ్ల మీద వెళ్లి ప్రజలను కలవాలి. వీలైతే ఈ-సైకిళ్లు వాడాలి. నేను కూడా సైకిల్ మీదే ప్రచారంలో పాల్గొంటాను" అని ప్రకటించారు. ప్రధానిగా మోదీ 12 ఏళ్లు పూర్తి చేసుకోవడం, తాను నాలుగోసారి సీఎంగా కొనసాగడం వంటి అంశాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల విజయాలపై పెద్ద ఎత్తున ప్రచారం చేయాలని ఆదేశించారు.

2

కార్యకర్తల సంక్షేమమే పార్టీకి ముఖ్యం: టీడీపీ అనేది అందరి పార్టీ అని, ప్రతి వర్గాన్ని ఓన్ చేసుకోవాలని చంద్రబాబు అన్నారు. "సోషల్ రీ-

మీ అయ్య జాగీరా?

తెలంగాణలో ఇకపై జనసేన పోటీ చేస్తుందని పవన్ ప్రకటన
బెదిరింపులకు, హెచ్చరికలకు భయపడే ప్రసక్తే లేదని స్పష్టీకరణ
చెరువు కబ్జా ఆరోపణలపై సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ సవాల్
తెలంగాణకు వ్యతిరేకం కాదని, విభజన తీరునే తప్పుపట్టానని వెల్లడి

తెలంగాణ, ఉష శ్రీ : అధికారంపై ఆశ లేదు, సమాజంలో మార్పు మాత్రమే లక్ష్యమని ఉద్ఘాటన తెలంగాణ గడ్డతో తనకు రాజకీయాలకు అతీతమైన అనుబంధం ఉందని, ఈ ప్రాంతంపై ఎనలేని ప్రేమ ఉందని జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఉద్ఘాటించారు. తనపై కొందరు చేస్తున్న విమర్శలు, బెదిరింపుల నేపథ్యంలో ఆయన మంగళవారం హైదరాబాద్‌లోని తన

అమరవీరుల త్యాగాల రూపం

ఆవిర్భావ దినోత్సవాన పవన్ కల్యాణ్ భావోద్వేగ సందేశం!
సకల జనుల సంకల్పం.. అమరుల త్యాగాల రూపం తెలంగాణ అన్న పవన్
అభివృద్ధి ఫలాలు చివరి వ్యక్తి వరకు చేరినప్పుడే నిజమైన ప్రగతి అని వ్యాఖ్య
తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలవాలని ఆకాంక్ష

ఆంధ్రప్రదేశ్, ఉష శ్రీ : తెలంగాణ రాష్ట్ర 12వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తెలంగాణ ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. స్వరాష్ట్ర సాధన వెనుక ఉన్న సుదీర్ఘ పోరాటాన్ని, అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ ఆయన ఒక సుదీర్ఘమైన, భావోద్వేగభరితమైన

దావూద్‌కు పాక్ ఐఎస్ఐ అండ

- దావూద్ ఇబ్రహీంకు చెందిన భారీ టెర్రర్ మాడ్యూల్‌ను భగ్నం చేసిన ఢిల్లీ పోలీసులు
- నిందితుల విచారణలో దావూద్ కరాచీలోని క్లిఫ్టన్‌లోనే నివసిస్తున్నట్లు మరోసారి నిర్ధారణ
- ఈ ఉగ్రకుట్ర వెనుక పాకిస్థాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐ హస్తం ఉన్నట్లు దర్యాప్తులో వెల్లడి
- ఢిల్లీ, ముంబై నగరాల్లో దాడులు చేయడమే ఈ ముఠా ప్రధాన లక్ష్యమని తేలిన వైనం

జాతీయం, ఉష శ్రీ

ఆ విశ్లేషకుడు చేసిన వ్యాఖ్యలు తప్పు

- ఓ విశ్లేషకుడు అమిత్ షాతో తన భేటీపై తప్పుగా మాట్లాడటంతో వివాదం మొదలైందన్న పవన్
- తనకు తెలంగాణ ప్రజలంటే గౌరవం అని వెల్లడి
- పాలకులను మాత్రమే తాను వ్యతిరేకిస్తున్నాని స్పష్టీకరణ
- పాలకుల తప్పులకు ప్రజలను బాధ్యులను చేయొద్దని హితవు

ఆంధ్రప్రదేశ్, ఉష శ్రీ

ఆంధ్రా, తెలంగాణ ప్రజల మధ్య కొందరు కావాలనే విద్వేషాలు రెచ్చగొడుతున్నారని, ఇది దేశ సమగ్రతకే ప్రమాదమని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. పాలకుల తప్పులకు ప్రజలను బాధ్యుల్ని చేయడం సరికాదని, తాను ఎప్పుడూ తెలంగాణ ప్రజలను గౌరవిస్తానని స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రొఫెసర్ నాగేశ్వర్ వ్యాఖ్యల విషయంలో ఇటీవల తనపై జరుగుతున్న దుష్ప్రచారం పట్ల తీవ్రంగా స్పందించారు. "అసలు ఈ గొడవ ఎందుకు, ఎక్కడ మొదలైందంటే... నేను గౌరవించే ఓ రాజకీయ విశ్లేషకుడు, కేంద్ర హోంమంత్రి అమిత్ షా గారితో నా భేటీ గురించి మీడియాలో తప్పుడు వ్యాఖ్యలు చేశారు. నేను, అమిత్ షా గారు మాట్లాడుకున్న విషయాలు ఆయన విన్నట్టుగా అబద్ధాలు చెప్పారు. దానిని నేను ఖండించడంతోనే ఈ వివాదం మొదలైంది. నేను వాస్తవాలు చెప్పగానే నాపై తిట్ల దండకం మొదలుపెట్టారు. దానికి ప్రతిగా మా జనసైనికులు కొన్ని కేసులు పెట్టారని తెలిసింది.

నేను కూడా పాల్గొంటాను

ఇంజనీరింగ్‌తో పదవులు, సీట్లు కేటాయించాం. నామినేటెడ్ పదవుల్లోనూ ఇదే సూత్రాన్ని పాటిస్తున్నాం. కార్యకర్తల సాధికారత, సంక్షేమం గురించి ఆలోచించే ఏకైక పార్టీ టీడీపీ. మరణించిన కార్యకర్తల కుటుంబాలకు రూ. 5 లక్షల బీమా, వారి పిల్లల చదువులకు ప్రత్యేక పాఠశాల, నైపుణ్య శిక్షణతో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాం. ప్రతి కార్యకర్త ఆరోగ్యంగా ఉండేందుకు ఎంతైనా ఖర్చు చేస్తాం" అని భరోసా ఇచ్చారు. నాయకులు కూడా కార్యకర్తలను ఆదుకునే విషయంలో ఇదే విధంగా ఆలోచించాలని సూచించారు. గత ప్రభుత్వంలో విధ్వంసమైన వ్యవస్థలను గాడిలో పెడుతున్నామని, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో రాష్ట్రానికి పోయిన బ్రాండ్‌ను తిరిగి తీసుకొచ్చామని తెలిపారు.

వన్ టైమ్ ఎమ్మెల్యేలుగా మిగలొద్దు: కొత్తగా గెలిచిన ఎమ్మెల్యేలకు ఆయన కీలక సూచనలు చేశారు. "కొత్త ఎమ్మెల్యేలు వన్ టైమ్ ఎమ్మెల్యేలుగా మిగిలిపోకూడదు. మళ్లీ మళ్లీ గెలవాలి. అభివృద్ధి, సుపరిపాలనతో పాటు ప్రజాప్రతినిధుల వ్యవహార శైలి కూడా ఓట్లను ప్రభావితం చేస్తుంది. ప్రజల కోసం ఎంత పని చేసినా నోరు అదుపులో పెట్టుకోకుంటే నష్టం జరుగుతుంది. కార్యకర్త నుంచి నాయకుడి వరకు ప్రతి ఒక్కరికీ క్యారెక్టర్, ట్రస్ట్ చాలా ముఖ్యం," అని హితవు పలికారు.

దేశంలోనే 32,000 టన్నుల ఏసిడి.

- ఇళ్లలో, ఆలయాల్లో ఉన్న బంగారాన్ని రీసైకిల్ చేయాలని ప్రధాని మోదీ పిలుపు
- బంగారం దిగుమతులు తగ్గించి విదేశీ మారక నిల్వలను కాపాడటమే లక్ష్యం
- ఒక శాతం బంగారం రీసైకిల్ చేసినా దిగుమతులు 30% తగ్గుతాయని నిపుణుల అంచనా
- దేశంలో 30,000 నుంచి 32,000 టన్నుల బంగారం నిల్వలు ఉన్నాయని అంచనా
- పథాని పిలుపును స్వాగతించిన జ్యువెలరీ సంఘాలు, పరిశ్రమ వర్గాలుం

జాతీయం: ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న అనిశ్చితుల నేపథ్యంలో దేశ విదేశీ మారక నిల్వలపై ఒత్తిడిని తగ్గించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ ప్రజలకు ఒక కీలక పిలుపునిచ్చారు. కొత్తగా బంగారం దిగుమతి చేసుకునే బదులుగా ఇళ్లలో, దేవాలయాల్లో నిరుపయోగంగా ఉన్న బంగారాన్ని రీసైక్లింగ్ చేయడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలని ఆయన సూచించారు. ఈ విధానం ద్వారా బంగారం దిగుమతులపై ఆధారపడటాన్ని గణనీయంగా తగ్గించవచ్చని ప్రధాని అభిప్రాయపడ్డారు.

ఏటా బిలియన్ల డాలర్లను వెచ్చించి బంగారం దిగుమతి : భారత్ ప్రపంచంలోనే రెండో అతిపెద్ద బంగారం వినియోగదారుగా ఉన్నప్పటికీ, దేశీయంగా ఉత్పత్తి చాలా స్వల్పం. ఈ కారణంగా ఏటా బిలియన్ల కొద్దీ డాలర్లను వెచ్చించి బంగారాన్ని దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. ముఖ్యంగా 2025-26 ఆర్థిక సంవత్సరంలో మన దేశం సుమారు 72.4 బిలియన్ డాలర్ల విలువైన బంగారాన్ని దిగుమతి చేసుకుంది. ఇది ముడి చమురు తర్వాత దేశ దిగుమతి బిల్లులో అతిపెద్దది. బంగారం దిగుమతులకు చెల్లింపులు యూఎస్ డాలర్లలో చేయాల్సి రావడం వల్ల, రూపాయి విలువపై ఒత్తిడి పెరిగి, కరెంట్ అకౌంట్ లోటు విస్తరిస్తోంది.

దేశంలోని గృహాలు, దేవాలయాల్లో నిరుపయోగంగా వేల టన్నుల బంగారం: ఈ సమస్యకు పరిష్కారంగానే ప్రధాని రీసైక్లింగ్‌ను ప్రోత్సహిస్తున్నారు. అంచనాల ప్రకారం ప్రస్తుతం దేశంలోని గృహాలు, దేవాలయాల్లో దాదాపు 30,000 నుంచి 32,000 టన్నుల బంగారం నిరుపయోగంగా ఉంది. ఈ పాత ఆభరణాలు, నాణేలు, మరియు ఇతర బంగారు వస్తువులను కరిగించి, శుద్ధి చేసి, 99.9% స్వచ్ఛమైన బంగారంగా మార్చవచ్చు. ఈ బంగారాన్ని తిరిగి కొత్త ఉత్పత్తుల తయారీకి ఉపయోగించడం వల్ల దిగుమతుల అవసరం తగ్గుతుంది.

రీసైక్లింగ్ విధానం ఆర్థిక వ్యవస్థకు ఎంతో ఉపయోగకరం: పరిశ్రమ నిపుణులు సైతం ప్రధాని ప్రతిపాదనను సమర్థిస్తున్నారు. ముత్తూట్ ఎగ్జిమ్ సీఈఓ కీయుర్ షా అంచనా ప్రకారం దేశంలో ఉన్న మొత్తం బంగారంలో కేవలం 1% ఏటా రీసైక్లింగ్‌కు వచ్చినా, మన దిగుమతులు 25 నుంచి 30 శాతం వరకు తగ్గుతాయి. స్వస్తిక ఇన్వెస్ట్‌మార్ట్ పరిశోధన హెడ్ సంతోష్ మీనా మాట్లాడుతూ, వ్యవస్థీకృత రీసైక్లింగ్ విధానం విదేశీ మారక నిల్వలపై ఒత్తిడిని తగ్గించడమే కాకుండా వాణిజ్య లోటును నియంత్రించి, దేశాన్ని ఆత్మనిర్భర్ దిశగా నడిపిస్తుందని వివరించారు. ప్రధాని పిలుపును జ్యువెలరీ సంఘాలు స్వాగతించాయి. పాత బంగారాన్ని మార్చుకునే వారికి తక్కువ తరుగుతో కొత్త డిజైన్లు అందించే కార్యక్రమాలను ఇప్పటికే ప్రారంభించాయి. మరోవైపు బంగారం ధరలు రికార్డు స్థాయిలో ఉండటంతో వివాహాలు, ఉన్నత విద్య వంటి అవసరాల కోసం పాత నగలను మార్చుకోవడం వినియోగదారులకు కూడా లాభదాయకంగా మారింది. మొత్తంమీద దిగుమతి చేసుకునే వినియోగదారుగా కాకుండా, దేశంలో ఉన్న వనరులనే సమర్థంగా వాడుకునే ఆర్థిక వ్యవస్థగా మారాలనేది ఈ పిలుపు వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం.

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం

నేడు తెలంగాణ 12వ ఆవిర్భావ దినోత్సవం
పోరాట పటిమకు తెలంగాణ ప్రతీక అన్న మోదీ
దేశ ప్రగతిలో తెలంగాణ కీలక పాత్ర పోషిస్తోందన్న అమిత్ షా

తెలంగాణ: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాష్ట్ర ప్రజలకు తెలుగులో హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ తన 12వ ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకుంటున్న తరుణంలో నేతలిద్దరూ ట్విట్టర్ వేదికగా స్పందించారు. తెలంగాణ రాష్ట్రం సాహసం, సంకల్పం, పోరాట పటిమకు ఒక శక్తిమంతమైన ప్రతీక అని ప్రధాని మోదీ కొనియాడారు. ఇక్కడి ప్రజల సృజనాత్మకత, వ్యాపార నైపుణ్యాలు అద్భుతమైనవని, వికసిత భారత్ కలని సాకారం చేయడంలో తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ప్రధాని స్పష్టం చేస్తూ, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. అమిత్ షా సైతం తెలుగులోనే తన సందేశాన్ని పంచుకుంటూ తెలంగాణ విశిష్ట సంస్కృతిని, పారిశ్రామిక నైపుణ్యాన్ని అభినందించారు. దేశ ప్రగతిలో తెలంగాణ కీలక పాత్ర పోషిస్తోందని, రాబోయే రోజుల్లో ఈ రాష్ట్రం మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి దేశ కీర్తిని మరింత పెంచుతుందని ఆశిస్తున్నట్లు పేర్కొంటూ ఆయన తన సందేశాన్ని 'జై తెలంగాణ'తో ముగించారు. దేశంలోని ఇద్దరు అగ్రనేతలు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం నాడు ఇక్కడి ప్రజలకు గౌరవపూర్వకంగా మాతృభాషలోనే శుభాకాంక్షలు తెలపడంపై సర్వత్ర హర్షం వ్యక్తమవుతోంది

ఆ విశ్లేషకుడు చేసిన వ్యాఖ్యలు తప్పు

కానీ, వాటన్నింటినీ వదిలేయమని నేను స్పష్టంగా చెప్పాను. అయినా ప్రెస్‌క్లబ్‌లో మళ్లీ నన్ను తిడుతూ, ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారు. నా మీద తెలంగాణ వ్యతిరేకి అనే ముద్ర వేయాలని చూస్తున్నారు. తెలంగాణ ఏర్పడి 12 ఏళ్లయినా, ఇప్పటికీ ఉపాధి లేకపోయినా, పరిశ్రమలు రాకపోయినా దానికి ఆంధ్రులే కారణమంటూ నిందించడం ఎంతవరకు సబబు? ప్రతిదానికీ పవన్ కల్యాణే కారణమని, ఆంధ్రులే కారణమని అంటే ఇక్కడికి పెట్టుబడులు ఎలా వస్తాయి? ప్రజలు ఎలా వస్తారు? తెలంగాణ ప్రజలు ఈ విషయాన్ని గ్రహించాలి. ఒకప్పుడు మద్రాసులో ఉన్న తెలుగు చిత్ర పరిశ్రమను, నాటి ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి గారు ఎంతో ముందుచూపుతో హైదరాబాద్‌కు తీసుకొచ్చారు. 50 ఏళ్లు కలిసి ఉన్న రాజధాని ఇది. అలాంటిది ఇప్పుడు కొంతమంది నాయకులు ఇక్కడికి రాకూడదంటున్నారు. నేను మొదటి నుంచీ చెబుతున్నాను... ప్రజలు వేరు, పాలకులు వేరు. తెలంగాణకు అన్యాయం చేసిన పాలకులను శిక్షించండి, అందులో పవన్ కల్యాణ్ ఉన్నా ఊరి తీయండి. అంతేగానీ, పాలకుల కోసం ప్రజల మధ్య విద్వేషాలు సృష్టించవద్దు. ఈ ప్రాంతీయ ద్వేషం దేశానికి మంచిది కాదు. రేపు సూరత్‌లో తెలుగువారిని ఉండొద్దని గుజరాతీలు, నాందేడ్‌లో మన వారిని ఉండొద్దని మహారాష్ట్రీయులు అంటే దేశం నిలబడుతుందా? మనమంతా భారతీయులం అనే విషయాన్ని మర్చిపోవద్దు. తెలంగాణ కూడా భారత్ లో అంతర్భాగమే" అని పవన్ స్పష్టం చేశారు.

మీ అయ్యా జాగీరా?

నివాసంలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో ఘాటుగా స్పందించారు. ఇకపై తెలంగాణలో జరిగే ఎన్నికల్లో జనసేన పార్టీ కచ్చితంగా పోటీ చేస్తుందని సంచలన ప్రకటన చేశారు. ఈ నిర్ణయంతో తెలంగాణ రాజకీయాల్లో కొత్త అధ్యాయానికి తెరలేపారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, "హైదరాబాద్‌లో ఎలా అడుగు పెడతావని, ఇక్కడ నీకేం పని అని కొందరు నన్ను ప్రశ్నిస్తున్నారు. దాడులు చేస్తామని హెచ్చరిస్తున్నారు. తెలంగాణ ఏమైనా వాళ్ల అయ్య జాగీరా? ఇలాంటి బెదిరింపులకు భయపడే వ్యక్తిని నేను కాదు," అని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఆంధ్రప్రదేశ్‌లో తనను తిరగనివ్వబోమని బెదిరించినప్పుడు, తన 'వారాహి' వాహనానికి అనుమతులు ఇచ్చి అండగా నిలబడింది తెలంగాణ సమాజమేనని ఆయన గుర్తుచేశారు. జనసేన పార్టీ పుట్టిందే తెలంగాణ నడిబొడ్డున అని, ఈ గడ్డ రుణం తీర్చుకోవాల్సిన బాధ్యత తనకు ఉందని స్పష్టం చేశారు.

విభజన తీరునే వ్యతిరేకించాను: తాను ఎన్నడూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు వ్యతిరేకం కాదని పవన్ కల్యాణ్ మరోసారి స్పష్టం చేశారు. "రాష్ట్రాన్ని విభజించిన తీరును మాత్రమే నేను వ్యతిరేకించాను. పార్లమెంట్ తలుపులు మూసి, ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరించడాన్ని తప్పుపట్టాను. అంతేగానీ, తెలంగాణ ప్రజల ఆకాంక్షను నేను ఎప్పుడూ గౌరవించాను. సామాజిక తెలంగాణ రావాలన్నదే నా ఆకాంక్ష" అని వివరించారు.

ఒక విశ్లేషకుడు చేసిన వ్యాఖ్యలతో మొదలైన వివాదాన్ని పట్టుకుని, ప్రెస్ క్లబ్‌లో సమావేశాలు పెట్టి మరీ తనను తిట్టే స్థాయికి కొందరు దిగజారారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ సవాల్: తనపై వస్తున్న భూకబ్జా ఆరోపణలపైనా పవన్ కల్యాణ్ తీవ్రంగా స్పందించారు. "హైదరాబాద్‌లో నేను ఒక చెరువును కబ్జా చేశానని ఆరోపిస్తున్నారు. నేను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి విజ్ఞప్తి చేస్తున్నా. ఆ భూమిని పరిశీలించండి. నేను కబ్జా చేశానని నిరూపణ అయితే, ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయకుండా ప్రభుత్వం ఆ భూమిని స్వాధీనం చేసుకోవచ్చు. నాపై చట్టపరమైన చర్యలు కూడా తీసుకోవచ్చు" అని బహిరంగ సవాల్ విసిరారు. తనకు అధికారం మీద ఆశ లేదని, ఏపీలోనే తాను అధికారాన్ని ఆశించలేదని, అలాంటిది తెలంగాణలో ఎందుకు ఆశిస్తానని ప్రశ్నించారు. వ్యవస్థలో మార్పు తీసుకురావడమే తన ఏకైక లక్ష్యమని పునరుద్ఘాటించారు.

క్షేత్రస్థాయిలోకి జనసేన.. ఇక పోటీయే: తెలంగాణలో పార్టీని బలోపేతం చేయాలని, ఎన్నికల్లో పోటీ చేయాలని క్షేత్రస్థాయి నాయకులు, కార్యకర్తలు ఎప్పటినుంచో కోరుతున్నారని పవన్ తెలిపారు. "ఇన్నాళ్లూ ఓపిక పట్టాం. ఇకపై ఊరుకునేది లేదు. నేనే స్వయంగా తెలంగాణ అంతటా పర్యటిస్తాను. రాబోయే ఎన్నికల్లో జనసేన పార్టీ కచ్చితంగా పోటీ చేస్తుంది. ఎవరు ఏం చేసుకుంటారో చూసుకోండి" అంటూ తన రాజకీయ ప్రత్యర్థులకు గట్టి హెచ్చరిక జారీ చేశారు. తనను విమర్శిస్తున్న నాయకులు కనీసం ఆదిలాబాద్ అడవుల్లో కూడా పర్యటించి ఉండరని, తనకు తెలంగాణలోని ప్రతి మూల తెలుసని ఆయన అన్నారు. ఈ ప్రకటనతో తెలంగాణ రాజకీయ సమీకరణాలు మారే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

దావూద్‌కు పాక్ ఐఎస్ఐ అండ

అండర్‌వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీం పాకిస్థాన్‌లోని కరాచీ నుంచే తన ఉగ్ర కార్యకలాపాలను కొనసాగిస్తున్నాడనే విషయం మరోసారి రుజువైంది. దావూద్ సిండికేట్ నడుపుతున్న ఓ భారీ టెర్రర్ మాడ్యూల్‌ను ఢిల్లీ పోలీసుల స్పెషల్ సెల్ తాజాగా భగ్నం చేసింది. ఈ కేసులో 8 మందిని అరెస్ట్ చేసి విచారించగా, సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఢిల్లీ, ముంబై నగరాల్లో దాడులకు ఈ ముఠా ప్రణాళిక రచించినట్లు పోలీసులు తెలిపారు.

ఇప్పటికీ కరాచీలోని క్లిఫ్టన్ రోడ్డులోనే నివాసం: నిందితుల విచారణలో దావూద్ ఇబ్రహీం ఇప్పటికీ కరాచీలోని క్లిఫ్టన్ రోడ్డులోనే నివసిస్తున్నట్లు స్పష్టమైంది. అతని ముఖ్య అనుచరుడైన ముద్దసర్ హుస్సేన్ సయ్యద్ అలియాస్ మున్నా జింగాడాతో తాము టచ్‌లో ఉన్నామని నిందితులు అంగీకరించారు. ఆపరేషన్ మొత్తం క్లిఫ్టన్ రోడ్డు నుంచే జరగడం దావూద్ అక్కడే ఉన్నాడనడానికి బలమైన ఆధారమని ఓ అధికారి పేర్కొన్నారు. పాక్ గూఢచార సంస్థ ఐఎస్ఐకి ఇది అత్యంత సురక్షితమైన ప్రదేశం కావడంతో దావూద్‌ను అక్కడే ఉంచి రక్షణ కల్పిస్తోందని తేలింది.

దావూద్‌కు కరాచీలో మొత్తం ఐదు అడ్రస్‌లు : దావూద్‌కు కరాచీలో మొత్తం ఐదు అడ్రస్‌లు ఉండగా, అందులో క్లిఫ్టన్‌లోని సౌదీ మసీదు సమీపంలోని ఇల్లే ప్రధాన నివాసమని దర్యాప్తులో వెల్లడైంది. డిఫెన్స్ హౌసింగ్ అథారిటీ, నూర్బాద్ ప్రాంతాల్లో కూడా అతనికి నివాసాలున్నాయి. 'ఆపరేషన్ సిందూర్' తర్వాత కొద్దికాలం పాటు దావూద్‌ను ఈ ఐదు చిరునామాలకు మార్చినప్పటికీ, పరిస్థితులు చక్కబడ్డాక తిరిగి క్లిఫ్టన్‌లోని తన ప్రధాన నివాసానికి చేరుకున్నాడని నిఘా వర్గాలు తెలిపాయి.

ఐఎస్ఐ పర్యవేక్షణలో ఆపరేషన్ : ఈ కుట్ర వెనుక ఐఎస్ఐ ప్రమేయం స్పష్టంగా కనిపిస్తోంది. ఐఎస్ఐ అధికారులు నేరుగా మున్నా జింగాడాతో సమావేశమై దాడుల ప్రణాళికపై సూచనలు ఇచ్చినట్లు దర్యాప్తులో తేలింది. దావూద్ నివాసం సమీపంలోనే జింగాడా ఓ కమాండ్ సెంటర్‌ను ఏర్పాటు చేయగా, దానికి ఐఎస్ఐ పూర్తిస్థాయిలో పర్యవేక్షణ, భద్రత కల్పించింది. ఆయుధాలను భారత్‌కు చేరవేయడంలోనూ ఐఎస్ఐ సహాయం చేసింది. పంజాబ్‌లోని గురుదాస్‌పూర్‌లో హ్యాండ్ గ్రెనేడ్లను జారవిడిచింది కూడా ఐఎస్ఐ ప్రమేయంతోనే అని అధికారులు గుర్తించారు. దాడులు పూర్తయ్యాక నేపాల్ మీదుగా దుబాయ్‌కి సురక్షితంగా పంపిస్తామని నిందితులకు జింగాడా హామీ ఇచ్చాడు. ఈ ఆపరేషన్ కోసం దావూద్ సిండికేట్ రూ. 20 లక్షలు కేటాయించినట్లు కూడా వెల్లడైంది

అమరవీరుల త్యాగాల రూపం

సందేశాన్ని పంచుకున్నారు. తెలంగాణను "సకల జనుల సంకల్పం.. అమరుల త్యాగాల రూపం" అని అభివర్ణించిన పవన్, ప్రముఖ కవి దాశరథి కృష్ణమాచార్య రాసిన "నా తెలంగాణ కోటి రతనాల వీణ" అనే ఐకానిక్ పంక్తులను గుర్తుచేశారు. దశాబ్దాల ప్రజల ఆకాంక్షలు, ఆత్మగౌరవ ఉద్యమం, అపారమైన త్యాగాల వల్ల సాకారమైన తెలంగాణ ఆవిర్భావం చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోతుందని పేర్కొంటూ... ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ, ప్రాణాలర్పించిన అమరవీరులకు ఆయన వినమ్రంగా నివాళులర్పించారు. తెలంగాణకు ఉన్న పోరాటాల వారసత్వాన్ని ప్రస్తావిస్తూ... సమ్మక్క-సారలమ్మల స్ఫూర్తి నుండి కొమురం భీమ్ వీరత్వం వరకు ఈ నేల ఎల్లప్పుడూ న్యాయం కోసం పోరాడిందని పవన్ కల్యాణ్ కొనియాడారు. ఇక్కడి గాలిలో ధైర్యం, నీటిలో ఉద్యమ స్ఫూర్తి, మట్టిలో అమరుల రక్తం కలిసి ఉన్నాయని భావోద్వేగంగా పేర్కొన్నారు. తెలంగాణతో తనకున్న వ్యక్తిగత అనుబంధాన్ని పంచుకుంటూ... ఫ్లోరోసిస్ పీడిత ప్రాంతాల సమస్యలు, గిరిజన హక్కులు, రైతుల కష్టాలు, యువత నిరుద్యోగం, విద్య, వైద్యం వంటి అంశాలను తాను ఎప్పుడూ కేవలం రాజకీయ కోణంలో కాకుండా మానవీయ కోణంలోనే చూశానని స్పష్టం చేశారు. ఐటీ, ఫార్మా, స్టార్టప్‌లు, విద్యా రంగాల్లో తెలంగాణ సాధిస్తున్న పురోగతిని ఆయన అభినందించారు. అయితే, అభివృద్ధి ఫలాలు సమాజంలో ఉన్న చివరి వ్యక్తికి సైతం చేరినప్పుడే నిజమైన ప్రగతి సాధ్యమవుతుందని పవన్ కల్యాణ్ అభిప్రాయపడ్డారు. గ్రామీణ ప్రాంతాలు, గిరిజన తండాలు, వెనుకబడిన తరగతులు, మహిళలు, యువత, చిన్న రైతులకు సమాన అవకాశాలు దక్కాలని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు, ఆత్మగౌరవానికి, సమగ్ర అభివృద్ధికి జనసేన పార్టీ ఎల్లప్పుడూ మద్దతుగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. ఈ 12వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలంగాణ మరింత ఉన్నతమైన వృద్ధిని సాధించాలని, ప్రతి కుటుంబం ఆనందంతో వర్ధిల్లాలని, సామాజిక న్యాయం మరియు సమగ్ర అభివృద్ధితో ఈ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.

ఆకివీడు పట్టణ గౌడ శెట్టి బలిజ నూతన కమిటీ ఎంపిక

ఆకివీడు :(ఉషశ్రీ) జూన్ 2 గౌడ శెట్టిబలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, గౌడ శెట్టి బలిజ సంఘం నాయకులు బొల్లా వెంకట్రావు, కట్టా రవి అధ్యక్షతన నూతన పట్టణ కమిటీ ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షులుగా సంగెడ్డ ఏడుకొండలు, ఉపాధ్యక్షులుగా జోగి నాగరాజు, సెక్రటరీగా బొక్క శ్రీను లను పెద్దల సమక్షంలో ఎన్నుకున్నారు. అదేవిధంగా పట్టణ యూత్ కమిటీ అధ్యక్షులుగా దొంగ నాగబాబు, ఈరి శ్యాములను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గౌడ శెట్టిబలిజ సంఘం సీనియర్ నాయకులు పలువురు మాట్లాడుతూ అందరం కలిసికట్టుగా సమాజంలో ముందుకు సాగుతూ సమాజంలో సంఘం మరింత బలపడే విధంగా నూతన కమిటీలు సంఘాన్ని ముందుకు తీసుకువెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో బొల్లా శేషుబాబు, కట్టా పెద్దబ్బాయి, ఈరి సత్యనారాయణ, రాజులపూడి వెంకటేశ్వరరావు,చేబ్రోలు శ్రీనివాస్, చేబ్రోలు పెద్దిరాజు, ఈరి రమేష్, అంగర శంకర్, అంగర దుర్గాప్రసాద్, కాగిత రాధాకృష్ణ, జోగి ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

సుజనా చౌదరి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించిన బీజేపీ నాయకులు

విజయవాడ, (ఉషశ్రీ) జూన్ 2: విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే, మాజీ కేంద్ర మంత్రి వై. సుజనా చౌదరి జన్మదినోత్సవ వేడుకలను భారతీయ జనతా పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ నాయకత్వంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విజయవాడలోని ఇంద్రకీలాద్రి శ్రీ కనకదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, సుజనా చౌదరి ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. పశ్చిమ నియోజకవర్గంలోని పలుచోట్ల కేక్ కటింగ్ కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు వస్త్రాలు, పండ్లు, మజ్జిగ పంపిణీ, అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. కార్యకర్తలు దప్పు వాయిద్యాలు, టపాసులతో జన్మదిన వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర హెడ్‌క్వార్టర్ ఇన్‌చార్జ్ ఉప్పలపాటి శ్రీనివాసరాజు, రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ బాజీ, రాష్ట్ర కార్యదర్శి బొడ్డు నాగలక్ష్మి, ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రతిపాటి శ్రీధర్‌తో పాటు ఎన్టీఆర్ జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమాజ పురోగతికి జనగణనలో కచ్చితత్వం కీలకం: కలెక్టర్ లక్ష్మీశ

ఎన్‌టీఆర్ జిల్లా, (ఉషశ్రీ)జూన్ 2: సమాజ అభివృద్ధి, ప్రభుత్వ ప్రణాళికల రూపకల్పనకు జనగణనలో కచ్చితత్వం అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ పేర్కొన్నారు. దోషరహిత డేటా సేకరణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. జి.కొండూరు లో మంగళవారం మునగపాడు గ్రామంలో పర్యటించిన కలెక్టర్, జనగణన-2027లో భాగమైన హౌస్ లిస్టింగ్ అండ్ హౌసింగ్ సెన్సస్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈసారి జనగణన పూర్తిగా డిజిటల్ విధానంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హౌస్ లిస్టింగ్, హౌస్ సెన్సస్ ప్రక్రియను పారదర్శకంగా, బాధ్యతాయుతంగా అమలు చేస్తున్నామని చెప్పారు. జనగణన సిబ్బంది ఇంటింటికీ వెళ్లే సమయంలో ప్రజలు సరైన, పూర్తి వివరాలను అందించాలని కలెక్టర్ కోరారు. జనగణన ద్వారా సేకరించే సమాచారం సంక్షేమ పథకాలు, మౌలిక వసతులు, విద్య, వైద్యం, ఉపాధి, గృహనిర్మాణం వంటి రంగాల్లో ప్రభుత్వ నిర్ణయాలకు ఆధారంగా నిలుస్తుందని వివరించారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న సిబ్బంది నిబద్ధతతో విధులు నిర్వర్తించి నాణ్యమైన డేటా సేకరణకు కృషి చేయాలని సూచించారు.

ఉమీద్ పోర్టల్ జూన్ 6తో ముగింపు

వక్ఫ్ ఆస్తుల వివరాలు వెంటనే నమోదు చేయాలి: ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్

అమరావతి, (ఉషశ్రీ)జూన్ 2: రాష్ట్రవ్యాప్తంగా వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ కోసం చేపట్టిన ఉమీద్ పోర్టల్‌లో డేటా నమోదు జూన్ 6తో ముగియనున్నందున, ఇప్పటికీ వివరాలు నమోదు చేయని వక్ఫ్ సంస్థలు, ముతవల్లీలు వెంటనే స్పందించాలని ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ కోరారు. రాష్ట్రంలోని వేలాది వక్ఫ్ సంస్థల వివరాలు ఇప్పటికే ఉమీద్ పోర్టల్‌లో నమోదు కాగా, కొంతమంది ముతవల్లీలు, నిర్వాహకులు ఇంకా నమోదు ప్రక్రియను పూర్తి చేయకపోవడంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వక్ఫ్ ఆస్తుల రక్షణ, ఆక్రమణల నివారణ, భవిష్యత్ న్యాయపరమైన వ్యవహారాలు, డిజిటల్ రికార్డుల సృష్టిలో ఉమీద్ పోర్టల్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. జూన్ 6 తర్వాత గడువు పొడిగింపుపై ఎలాంటి హామీ లేదని స్పష్టం చేసిన ఆయన, పెండింగ్‌లో ఉన్న అన్ని వివరాలు, పత్రాలు, రికార్డులను వెంటనే పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. వక్ఫ్ ఆస్తులను రక్షించుకోవాలంటే ముందుగా వాటిని ప్రభుత్వ డిజిటల్ రికార్డుల్లో నమోదు చేయడం అత్యవసరమని పేర్కొన్నారు. ఈ అంశాన్ని ప్రతి ముతవల్లి వ్యక్తిగత బాధ్యతగా తీసుకుని నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని పిలుపునిచ్చిన అబ్దుల్ అజీజ్, "ఈ రోజు నమోదు చేసే సమాచారం రేపటి వక్ఫ్ ఆస్తుల రక్షణకు కవచంగా నిలుస్తుంది" అని అన్నారు.

అభయారణ్యంలో అక్రమ విద్యుత్ కనెక్షన్లు

మొద్దు నిద్రలో విజిలెన్స్ అధికారులు

కైకలూరు ఉషశ్రీ : సామాన్యుడు విద్యుత్ కనెక్షన్ తీసుకోవాలంటే ముప్పు తిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్లు తాగించే విద్యుత్ శాఖ అధికారులు కొల్లేరు నిషేధిత విద్యుత్ కనెక్షన్లు ఇస్తున్నారు అన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి ఏలూరు జిల్లాలోని కొల్లేరు పరివాహక ప్రాంతాలైన కైకలూరు మండలం మండవల్లి మండలం ఏలూరు రూరల్ ప్రాంతాల్లో అక్రమ విద్యుత్ కనెక్షన్ల దండ యదేచ్ఛగా నడుస్తుందని పలువురు వాపోతున్నారు నిబంధనల ప్రకారం విద్యుత్ స్తంభం నుండి 30 మీటర్ల దూరం వరకు మాత్రమే విద్యుత్ స్తంభం నుండి విద్యుత్ సరఫరా కి కనెక్షన్ మంజూరు చేయాలి కానీ కొల్లేరు పరివాహక ప్రాంతంలో నిషేధిత అభయారంగంలో నిబంధనలను కొల్లేరులో పాతర వేసి విద్యుత్ సరఫరా చేస్తున్నారు . ఇంత జరుగుతున్న విద్యుత్ శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారంటే దీని వెనక భారీ స్థాయిలో డబ్బులు చేతులు మారుతున్నాయి అన్న విమర్శలు సైతం వినిపిస్తున్నాయి అంతేకాకుండా అక్రమ విద్యుత్ కనెక్షన్ వెనక రాజకీయ నాయకుల అండదండలు కూడా పుష్కలంగా ఉన్నాయని విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి దీంతో కొల్లేరులో నిషేధిత అభయారణ్య ప్రాంతంలో యదేచ్ఛగా రొయ్యల సాగు చేస్తున్నారు దీనిపై పనిచేసే కూలీలు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదాలకు గురై మృత్యువాత పడుతున్నారు ఇంత జరుగుతున్న విద్యుత్ శాఖ అధికారులలో ఏమాత్రం చలనం కలగటం లేదు. ఇప్పటికే కొల్లేరు అభయారణ్యంలో అక్రమ విద్యుత్ కనెక్షన్లపై జనసేన పార్టీ నాయకులు ఏలూరు జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేసి యున్నారు. అయినప్పటికీ విద్యుత్ శాఖ అధికారులలో ఏమాత్రం చలనం రాకపోవడం విశేషం. కొల్లేరు అభయారణ్యం అటవీ శాఖ అధికారుల ఆధీనంలో ఉండటం వారు కూడా అక్రమ సాగును ప్రోత్సహించటం దీనికి తోడు విద్యుత్ శాఖ అధికారులు అక్రమ సాగుకు ప్రోత్సహిస్తూ విద్యుత్ సరఫరా చేయటం అక్రమ సాగుదారులకు వరంగా మారుతుంది . రాష్ట్ర ప్రభుత్వం రైతులకు విద్యుత్ సబ్సిడీపై ఇస్తుంటే సదరు విద్యుత్తు కొల్లేరు అభయారణ్యంలో అక్రమ సాగుకు వినియోగించడం

కూడా ప్రభుత్వ ఆశయానికి తూట్లు పొడిచినట్టే అవుతుంది. ఇప్పటికైనా ఫారెస్ట్ విద్యుత్ శాఖ అధికారులు నిబంధన ప్రకారం విద్యుత్ సరఫరా చేయాలని అక్రమ విద్యుత్ కనెక్షన్ దారులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని దుబ్బారావ్తున్న ప్రజాధనాన్ని దుర్వినియోగం కాకుండా అడ్డుకొని సంక్షేమ పథకాలను రైతులకు సక్రమంగా అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు నాయకులు రైతులు కోరుతున్నారు

కలసి యోగా చేద్దాం.. యోగాంధ్ర-2026 ను విజయవంతం చేద్దాం: కలెక్టర్ లక్ష్మీశ

ఎన్‌టీఆర్ జిల్లా, (ఉషశ్రీ)జూన్ 2: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 7 నుంచి 21 వరకు జిల్లావ్యాప్తంగా యోగాంధ్ర-2026 కార్యక్రమాలను పండుగ వాతావరణంలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు. ఈ కార్యక్రమాల విజయవంతానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, గత ఏడాది యోగాంధ్ర కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించి జిల్లా ఆదర్శంగా నిలిచిందని గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో ఈ ఏడాది కూడా ప్రజల భాగస్వామ్యంతో కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న థీమాటిక్ యోగాలో భాగంగా ఎన్‌టీఆర్ జిల్లాలో పోలీస్ థీమ్ యోగా కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే టూరిజం యోగా కార్యక్రమాల కింద ఇబ్రహీంపట్నం మండలంలోని పవిత్ర సంగమం, హరిత బెరం పార్క్‌లలో ప్రత్యేక యోగా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. జిల్లాలోని పాఠశాలలు, ఆసుపత్రులు, పార్కులు, క్రీడా మైదానాలు, పట్టణ ప్రాంతాల్లోని అన్ని పార్కుల్లో యోగా కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. యోగా ప్రోటోకాల్‌పై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రధాన కూడళ్ల వద్ద ప్రత్యేక వీడియోలను ప్రదర్శించాలని సూచించారు. యోగం ఆరోగ్యకరమైన జీవనశైలికి ఎంతో ఉపయోగపడుతుందని, ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థలు కలిసి యోగాంధ్ర-2026ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం అధికారులతో కలిసి 45 నిమిషాల కామన్ యోగా ప్రోటోకాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా ఆయుష్ అధికారి డా. వై. రత్నప్రియదర్శిని, ఆయుర్వేద వైద్య కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ డా. బుల్లయ్య, ఆయుర్వేద ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. పి. జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

సాంస్కృతిక వైభవంతో గోదావరి పుష్కరాలు-2027

- ఆధ్యాత్మిక పర్యాటకానికి ప్రాధాన్యం.. 10 కోట్ల మంది భక్తుల రాకకు భారీ ఏర్పాట్లు
- గోదావరి పుష్కరాలపై సీఎం చంద్రబాబు సమీక్ష

అమరావతి, (ఉషశ్రీ) జూన్ 2: వచ్చే ఏడాది జరిగే గోదావరి పుష్కరాలను రాష్ట్ర సాంస్కృతిక, ఆధ్యాత్మిక వైభవాన్ని ప్రతిబింబించేలా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. గోదావరి పరివాహక ప్రాంతంలో ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రాలను అనుసంధానం చేస్తూ ఆధ్యాత్మిక పర్యాటకానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. గోదావరి పుష్కరాలు--2027 నిర్వహణపై మంత్రుల కమిటీ, వివిధ శాఖల ఉన్నతాధికారులతో మంగళవారం సచివాలయంలో సీఎం సమీక్ష నిర్వహించారు.

పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం: గోదావరి పుష్కరాలకు ముందే పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని సీఎం తెలిపారు. దీంతో పుష్కరాల సందర్భంగా పోలవరం ప్రాజెక్టు కూడా ప్రధాన ఆకర్షణగా మారుతుందని చెప్పారు. ధవళేశ్వరం నుంచి పోలవరం వరకు అఖండ గోదావరి అభివృద్ధి ప్రాజెక్టును చేపట్టి, గోదావరి గట్టులను సుందరీకరించాలని ఆదేశించారు.

పుష్కరాలు అభివృద్ధికి అవకాశంగా మారాలి: పుష్కరాల కోసం చేపట్టే పనులు కేవలం తాత్కాలిక ఏర్పాట్లకే పరిమితం కాకుండా, భవిష్యత్తులో గోదావరి పరివాహక ప్రాంతానికి శాశ్వత ఆస్తులుగా నిలవాలని సీఎం సూచించారు. ముఖ్యంగా రాజమహేంద్రవరం నగరాన్ని మెగా సిటీగా అభివృద్ధి చేసేలా ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు.

కేంద్ర సహకారం కోరాలని సూచన: పుష్కరాల సమయంలో భారీ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశమున్నందున జాతీయ, రాష్ట్ర రహదారులు, రైల్వే సేవలు, ట్రాఫిక్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సీఎం ఆదేశించారు. ప్రత్యేక రైళ్ల కోసం కేంద్ర రైల్వే శాఖను కోరడంతో పాటు, పుష్కరాల నిర్వహణకు కేంద్ర ప్రభుత్వ సహకారం కూడా తీసుకోవాలని సూచించారు.

టెంట్ సిటీలు, హోమ్ స్టేలకు ప్రాధాన్యం: భక్తుల వసతి కోసం కుంభమేళా తరహాలో టెంట్ సిటీలు, హోమ్ స్టేలను ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని అధికారులకు సూచించారు. గోదావరి పుష్కరాలను రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి దోహదపడే మహోత్సవంగా మార్చాలని సీఎం పేర్కొన్నారు.

6 జిల్లాల్లో 525 ఘాట్లు: పోలవరం, ఏలూరు, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కోనసీమ, కాకినాడ జిల్లాల్లో మొత్తం 525 ఘాట్లను సిద్ధం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం ఉన్న 288 ఘాట్లకు అదనంగా 237 కొత్త ఘాట్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రస్తుతం 4.5 కిలోమీటర్ల మేర ఉన్న ఘాట్ల పొడవును 9.9 కిలోమీటర్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

10 కోట్ల మంది భక్తుల రాక అంచనా: ఈసారి గోదావరి పుష్కరాలకు సుమారు 9.95 కోట్ల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించనున్నట్లు ప్రభుత్వం అంచనా వేస్తోంది. గతంలో 1991లో 1.2 కోట్లు, 2003లో 5 కోట్లు, 2015లో 4.86 కోట్ల మంది భక్తులు పుష్కర స్నానాలు చేశారు. ఈసారి ఒక్క రోజులోనే కోటి మంది భక్తులు స్నానాలు చేసే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు.

రూ.211 కోట్ల పనులకు ఇప్పటికే ఆమోదం: పుష్కరాల నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా ఇప్పటికే రూ.211.97 కోట్ల వ్యయంతో 132 అభివృద్ధి పనులకు ప్రభుత్వం పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. ఘాట్లు, రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం, ట్రాఫిక్ నిర్వహణ, భక్తుల సౌకర్యాలకు సంబంధించిన పనులు వేగంగా చేపట్టాలని సీఎం ఆదేశించారు.

త్వరలో పుష్కర లోగో, వెబ్‌సైట్: గోదావరి పుష్కరాల ప్రచారాన్ని విస్తృతంగా చేపట్టేందుకు ప్రత్యేక లోగోను త్వరలో విడుదల చేయనున్నట్లు సీఎం తెలిపారు. అలాగే అఖండ గోదావరి పుష్కరాలు-2027 పేరుతో ప్రత్యేక వెబ్‌సైట్‌ను ప్రారంభించి సమాచారాన్ని అందుబాటులో ఉంచాలని సూచించారు. జూన్ 24న సమగ్ర యాక్షన్ ప్లాన్‌తో రావాలని అధికారులకు ఆదేశిస్తూ, అదే రోజు నుంచి పుష్కరాల కౌంట్‌డౌన్ ప్రారంభమవుతుందని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

నైరుతి రుతుపవనాల సేవాల్లేను
ఎదుర్కోవడానికి ముందస్తు సన్నద్ధతే మార్గం

- కొండపావులూరులో ఎన్ఐడీఎం –ఐఎండీ సంయుక్త సదస్సు
- వాతావరణ హెచ్చరికలతో ప్రాణ, ఆస్తి నష్టాలను గణనీయంగా తగ్గించవచ్చు: ఐఎండీ డీజీ డా. ఎం. మహాపాత్ర

అమరావతి,(ఉషశ్రీ)జూన్ 2: గన్నవరం మండలం అడవినెక్కలలోని జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (ఎన్ఐడీఎం) సదరన్ క్యాంపస్‌లో మంగళవారం "నైరుతి రుతుపవనాలు–2026 అంచనాలు, సన్నద్ధత మరియు బహుళ విపత్తుల వాతావరణ హెచ్చరిక సేవలు" అంశంపై కీలక వాటాదారుల సమావేశం నిర్వహించారు. భారత వాతావరణ శాఖ (ఐఎండీ), జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (ఎన్ఐడీఎం) సంయుక్తంగా సదస్సు జరిగింది. న్యూఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్న భారత వాతావరణ శాఖ డైరెక్టర్ జనరల్ డా. ఎం. మహాపాత్ర, రుతుపవనాల నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, విపత్తు నిర్వహణ సంస్థలు, స్థానిక యంత్రాంగం మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డా. మహాపాత్ర మాట్లాడుతూ ఎల్‌నినో, లా నినా, ఇండియన్ ఓషన్ డైపోల్, మేడెన్ జూలియన్ ఆసిలేషన్ వంటి ప్రపంచ స్థాయి వాతావరణ వ్యవస్థల ప్రభావంతో రుతుపవనాల స్వభావంలో మార్పులు వస్తున్నాయని తెలిపారు. ఒకే సీజన్‌లో ఒక ప్రాంతంలో వరదలు, మరో ప్రాంతంలో కరువు పరిస్థితులు ఏర్పడుతున్నాయని చెప్పారు.

వర్షాలు పడే రోజులు, పొడి రోజుల మధ్య తీవ్ర వ్యత్యాసాలు: నమోదవుతున్నాయని, దీనివల్ల వ్యవసాయం, నీటి నిర్వహణ, విపత్తు నిర్వహణపై ప్రభావం పడుతోందన్నారు. బంగాళాఖాతంలో ఏర్పడే 13 నుంచి 14 అల్పపీడనాల్లో 90 శాతానికి పైగా ఉత్తర బంగాళాఖాతంలోనే ఏర్పడతాయని డా. మహాపాత్ర వివరించారు. ఈ వ్యవస్థలు పశ్చిమ దిశగా కదులుతూ ఉత్తర ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ మీదుగా గుజరాత్ వరకు భారీ వర్షాలు కురిపిస్తాయని చెప్పారు. గోదావరి, కృష్ణా నదీ పరివాహక ప్రాంతాలు ఈ ప్రభావానికి ఎక్కువగా గురయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు.

తూర్పు కనుమల వద్ద అత్యంత భారీ వర్షాలు: ఉత్తర ఆంధ్రప్రదేశ్, దక్షిణ ఒడిశా సరిహద్దుల్లోని తూర్పు కనుమల ప్రాంతాల్లో "ఓరోగ్రాఫిక్ ఎఫెక్ట్" కారణంగా అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంటుందని తెలిపారు. రుతుపవన గాలులు కొండలను ఢీకొన్నప్పుడు వర్షపాతం తీవ్రత పెరుగుతుందని వివరించారు. అల్పపీడనాలు ఏర్పడిన సమయంలో అమావాస్య, పౌర్ణమి రోజుల్లో సముద్రపు పోటు అధికంగా ఉంటే నదుల వరద నీరు సముద్రంలోకి వెళ్లకుండా తీరప్రాంతాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

ప్రజలు, రైతులకు ప్రత్యేక యాప్‌లు: ఈ ఏడాది ఆంధ్రప్రదేశ్‌లో, ముఖ్యంగా మధ్య ఆంధ్రప్రదేశ్‌లో సాధారణం లేదా సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని డా. మహాపాత్ర తెలిపారు. జూన్ నెలలో వర్షాలు అనుకూలంగా ఉంటాయన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలకు ముందస్తు వాతావరణ సమాచారాన్ని అందించేందుకు "మౌసమ్", "మౌసమ్ గ్రామ్" యాప్‌లను అందుబాటులోకి తీసుకొచ్చామని డా. మహాపాత్ర తెలిపారు. రైతుల కోసం "క్రాప్ వెదర్" వంటి ప్రత్యేక యాప్‌లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. రైతులు తమ పంట వివరాలు నమోదు చేస్తే, వర్షపాతం, ఉష్ణోగ్రతలు, గాలుల వేగం, తెగుళ్ల నివారణ చర్యలపై ముందస్తు సమాచారం పొందవచ్చని వివరించారు.

విపత్తు నష్టాలను తగ్గించడంలో పరిశోధన కీలకం: ఐసీఏఆర్–క్రిడా మాజీ ప్రొఫెసర్ డా. బి.వి. రమణరావు ప్రత్యేక అతిథిగా పాల్గొన్న డా. బి.వి. రమణరావు మాట్లాడుతూ, తుఫానులు, వరదలు, కరువులు, సునామీల వల్ల దేశానికి భారీగా ప్రాణ, ఆస్తి నష్టం జరుగుతోందన్నారు. విపత్తుల వల్ల కలిగే నష్టాలను 10 నుంచి 15 శాతం తగ్గించినా దేశాభివృద్ధికి భారీగా నిధులు ఆదా చేయవచ్చన్నారు. ముందస్తు హెచ్చరికలతో పాటు శాస్త్రీయ పరిశోధనలు కూడా సమాంతరంగా సాగాలని, ఏ ప్రాంతాలు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందో ముందుగానే గుర్తించే వ్యవస్థలు అవసరమన్నారు.

ఆంధ్రప్రదేశ్‌ను క్లైమేట్ స్మార్ట్ స్టేట్‌గా తీర్చిదిద్దాలి: ఆర్ఎంసీ చెన్నై అధిపతి డా. డి. శివానంద పై దక్షిణ ఆసియా ప్రాంతంలో వార్షిక వర్షపాతంలో 75 నుంచి 90 శాతం వరకు జూన్–సెప్టెంబర్ మధ్యనే కురుస్తుందని తెలిపారు. వర్షపాతం తీరులో వచ్చే మార్పులు వ్యవసాయం, ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతాయని చెప్పారు. వాతావరణ మార్పుల ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ఆంధ్రప్రదేశ్‌ను "క్లైమేట్ స్మార్ట్ స్టేట్"గా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు.

విపత్తు సమయంలో ప్రాణనష్టం గణనీయంగా తగ్గింది: ఎన్‌డిఆర్ఎఫ్ కమాండెంట్ ప్రసన్న కుమార్ ఎన్‌డిఆర్ఎఫ్ 10వ బెటాలియన్ కమాండెంట్ వి.వి.ఎన్. ప్రసన్న కుమార్ మాట్లాడుతూ, ఐఎండీ హెచ్చరికల ఆధారంగా ఎన్‌డిఆర్ఎఫ్ బృందాలు ముందుగానే ప్రమాద ప్రాంతాలకు చేరుకుంటాయని తెలిపారు. 1999 ఒడిశా సూపర్ సైక్లోన్ సమయంలో 10 వేల మందికి పైగా మరణించగా, 2023 బిపోర్జాయ్ తుఫాను సమయంలో సమన్వయ చర్యలతో ప్రాణనష్టం లేకుండా చూడగలిగామని చెప్పారు.

ముందస్తు సన్నద్ధతే అత్యుత్తమ పెట్టుబడి ఎన్ఐడీఎం జాయింట్ డైరెక్టర్ కల్నల్ శ్రీనివాసులు రెడ్డి: విపత్తు సంభవించిన తర్వాత చేసే ఖర్చు కంటే, ముందస్తు సన్నద్ధత కోసం పెట్టే ప్రతి రూపాయి 14 రూపాయల నష్టాన్ని నివారించగలదని కల్నల్ పి. శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. వాతావరణ హెచ్చరికలు కేవలం సమాచారంగా కాకుండా ప్రభావ ఆధారిత అంచనాలుగా ప్రజలకు చేరాలని, చివరి వ్యక్తి వరకు హెచ్చరికలు చేరేలా సాంకేతిక వ్యవస్థలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

సాంకేతిక సదస్సులో కీలక ప్రజెంటేషన్లు: అనంతరం నిర్వహించిన సాంకేతిక సదస్సులో నైరుతి రుతుపవనాల అంచనాలు, సైక్లోన్ వార్నింగ్ వ్యవస్థ, విపత్తు నిర్వహణ వ్యూహాలు, ఎన్ఐడీఎం సేవలపై నిపుణులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్లు ఇచ్చారు. వ్యవసాయం, జలవనరులు, పశుసంవర్ధక, పౌరసరఫరాలు, మున్సిపల్ పరిపాలన, విమానాశ్రయ ప్రాధికార సంస్థ, ఆకాశవాణి, ప్రసార భారతి తదితర శాఖల అధికారులు తమ కార్యాచరణ ప్రణాళికలను వివరించారు. స్టేక్‌హోల్డర్స్ సమావేశంలో ఐఎండీ శాస్త్రవేత్తలు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, విపత్తు నిర్వహణ నిపుణులు, పరిశోధకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

యువశక్తికి కొత్త నిర్వచనం.. యూత్ టైం బ్యాంక్: కలెక్టర్ లక్ష్మీశ

ఎన్‌టీఆర్ జిల్లా, జూన్ 2: విజయవాడ ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి (జీజీహెచ్)లో అమలు చేస్తున్న యూత్ టైం బ్యాంక్ కార్యక్రమం యువత సేవాభావానికి కొత్త దిశను చూపుతోందని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అన్నారు. మంగళవారం కార్యక్రమం 73వ రోజు కొనసాగుతున్న సేవలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా దనేకుల ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు, వాసవ్య మహిళా మండలి వాలంటీర్లు అందిస్తున్న సేవలను కలెక్టర్ అభినందించారు. రోగులు, వారి సహాయకులకు మార్గదర్శనం చేయడం, అవసరమైన సమాచారం అందించడం, ఆసుపత్రి సేవలను సులభతరం చేయడంలో యువత చురుకుగా పాల్గొనడంపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. సమాజ సేవలో యువత భాగస్వామ్యం పెరగడం అభినందనీయమని, ఇటువంటి కార్యక్రమాలు బాధ్యతాయుత పౌరసత్వాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. యూత్ టైం బ్యాంక్ ద్వారా యువత తమ సమయాన్ని సమాజానికి అంకితం చేస్తూ సేవా దృక్పథాన్ని చాటుతున్నారని కలెక్టర్ అన్నారు. ప్రస్తుతం జీజీహెచ్‌తో పాటు ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో కూడా ఈ సేవలు విస్తరించడం మైలురాయిగా పేర్కొన్నారు. అలాగే ఇంద్రకీలాద్రిపై కూడా యూత్ టైం బ్యాంక్ సేవలను విస్తరించేందుకు చర్యలు తీసుకోవాలని యువజన సంక్షేమ శాఖ జిల్లా ముఖ్య కార్య నిర్వాహణాధికారి డా. కొల్లేటి రమేష్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్, ఆర్ఎంవో తదితరులు పాల్గొన్నారు.

హరిత లక్ష్య సాధనకు సమష్టిగా ముందడుగు వేయాలి: కలెక్టర్ లక్ష్మీశ

ఎన్‌టీఆర్ జిల్లా, (ఉషశ్రీ)జూన్ 2: రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు 2047 నాటికి హరిత విస్తీర్ణాన్ని 50 శాతానికి పెంచేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. అటవీ, డ్వామా, వ్యవసాయం, ఉద్యాన, గ్రామీణాభివృద్ధి తదితర శాఖల అధికారులతో మంగళవారం వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ, సంస్థల భూములు, రహదారులు, రైల్వే మార్గాలు, కాలువల వెంట విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రతి శాఖ తమ పరిధిలో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని, మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో దాదాపు 40 లక్షల మొక్కలను సమీకరించాల్సిన అవసరం ఉందని, ఇందుకోసం నర్సరీల సామర్థ్యాన్ని పెంచి అవసరమైన మొక్కల రకాలను ముందుగానే గుర్తించాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయంతో పనులను వేగవంతం చేసి, ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందిస్తూ పచ్చదనం పెంపు ఉద్యమాన్ని సామూహిక కార్యక్రమంగా ముందుకు తీసుకెళ్లాలని కలెక్టర్ లక్ష్మీశ పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా అటవీ అధికారి జి. సతీష్, డ్వామా పీడీ ఎ. రాము, డీపీవో

టాక్టికల్ అర్బనిజంలో భాగంగా ప్రత్యేక డ్రైవ్

చిరు వ్యాపారులు, ఆటో డ్రైవర్లకు పోలీసుల కౌన్సెలింగ్

విజయవాడ, (ఉషశ్రీ)జూన్ 2: నగరంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు ఎన్‌టీఆర్ జిల్లా పోలీసులు టాక్టికల్ అర్బనిజంలో భాగంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర బాబు ఆదేశాల మేరకు, ట్రాఫిక్ డీసీపీ షీరిన్ బేగం సూచనలతో వన్ ట్రాఫిక్ ఏసీపీ రామచంద్రరావు పర్యవేక్షణలో ఈ కార్యక్రమం చేపట్టారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మహా మండపం నుంచి వినాయక టెంపుల్ వరకు, సమారంగ్ చౌక్, నెమలి బిల్డింగ్ రోడ్ తదితర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి రహదారులపై వ్యాపారం చేస్తున్న చిరు వ్యాపారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించే విధంగా రోడ్డుపై ఉంచిన వస్తువులను తొలగించారు. అదేవిధంగా ఆటో డ్రైవర్లు ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలపకుండా, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. గత కొన్ని రోజులుగా నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక డ్రైవ్‌లతో ట్రాఫిక్ పరిస్థితులు మెరుగుపడుతున్నాయని, ప్రజలు, వాహనదారులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ ఓంకార్, ఆర్ఎస్ఐ శ్రీధర్‌తో పాటు ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో కార్మికునికి ఎమ్మెల్యే బొలిశెట్టి రూ.5వేలు ఆర్థిక సహాయం

తాడేపల్లిగూడెం :(ఉషశ్రీ) జూన్ 2 : ఆటో కార్మికునికి తాడేపల్లిగూడెం శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ రూ.5,000లు ఆర్థిక సహకారం అందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపు మేరకు పి 4 కార్యక్రమంలో భాగంగాఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ప్రతినెలా ఒక ఆటో కార్మికునికి 5వేల రూపాయలు ఆర్థిక సహకారం అందిస్తున్నారు.స్థానిక జనసేన కార్యాలయంలో మంగళవారం పి4 సేవా కార్యక్రమం నిర్వహించారు. తాడేపల్లిగూడెం పట్టణం ప్రభాత సెంటర్,దుర్గా ఆటో యూనియన్ సభ్యుడు నున్న సత్యనారాయణ అనే ఆటోకార్మికునికి రూ. 5వేలు అందజేశారు.ఆపదలో ఉన్న కార్మికులను ఆదుకుంటున్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఆటో యూనియన్ నాయకులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

రూ.62.20 కోట్ల సబ్సిడీతో పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

భూసార పరిరక్షణ, రైతుల సాగు ఖర్చుల తగ్గింపే లక్ష్యం: మంత్రి అచ్చెన్నాయుడు

అమరావతి, (ఉషశ్రీ)జూన్ 2: రైతు సంక్షేమం, భూసార పరిరక్షణ, సుస్థిర వ్యవసాయాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ ఖరీఫ్–2026 సీజన్‌లో పచ్చిరొట్ట పంటల సాగును రాష్ట్ర ప్రభుత్వం విస్తృతంగా ప్రోత్సహిస్తున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. రైతులకు మేలు చేసే కార్యక్రమాలకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని పేర్కొన్నారు. పచ్చిరొట్ట పంటల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రూ.62.20 కోట్ల సబ్సిడీని కేటాయించిందని మంత్రి వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 91,918 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలను జిల్లాలకు కేటాయించినట్లు తెలిపారు. ఇందులో జీలుగ 50,311 క్వింటాళ్లు, జనుము 21,291 క్వింటాళ్లు, పిల్లి పెసర 20,316 క్వింటాళ్లు ఉన్నాయని వివరించారు. ఇప్పటికే 40,459 క్వింటాళ్ల విత్తనాలను జిల్లాలకు సరఫరా చేయగా, 19,667 మంది రైతులకు 5,687 క్వింటాళ్ల విత్తనాలను పంపిణీ చేసి రూ.4.76 కోట్ల సబ్సిడీ ప్రయోజనాన్ని అందించినట్లు తెలిపారు. పచ్చిరొట్ట పంటల సాగు ద్వారా నేలలో సేంద్రియ కార్బన్ శాతం పెరగడంతో పాటు నత్రజని నిల్వలు అధికమవుతాయని మంత్రి చెప్పారు. దీంతో రసాయన ఎరువుల వినియోగం తగ్గి, సాగు ఖర్చులు తగ్గడమే కాకుండా భూముల ఉత్పాదకత కూడా పెరుగుతుందని పేర్కొన్నారు. సహజ, సేంద్రియ వ్యవసాయం వైపు రైతులు ఆసక్తి చూపుతున్న నేపథ్యంలో పచ్చిరొట్ట సాగుకు ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తున్నామని తెలిపారు. గ్రామ స్థాయిలో వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ రైతులకు పచ్చిరొట్ట పంటల ప్రయోజనాలను వివరిస్తున్నారని చెప్పారు. కృష్ణా, గుంటూరు, అన్నమయ్య, వైఎస్సార్ కడప, ఏలూరు, బాపట్ల, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో ఇప్పటికే వేలాది మంది రైతులు ఈ కార్యక్రమం ద్వారా లబ్ధి పొందినట్లు మంత్రి వెల్లడించారు. రైతుల అవసరాలకు అనుగుణంగా విత్తనాల సరఫరాను మరింత పెంచి పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. వ్యవసాయాన్ని లాభసాటి రంగంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్న అచ్చెన్నాయుడు, నాణ్యమైన విత్తనాలు, సబ్సిడీ పథకాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నీటి వనరుల సమర్థ వినియోగం, భూసార పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. భూమి ఆరోగ్యంగా ఉంటే రైతు అభివృద్ధి చెందుతాడని, రైతు అభివృద్ధి చెందితే రాష్ట్రం పురోగమిస్తుందనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు.

రాయలసీమకు నీళ్లు ఇచ్చాం

- తుంగభద్ర డ్యాంపై కీలక సమీక్ష
- ఈ నెలాఖరాయలసీమరులో కొత్త గేట్ల ప్రారంభం

అమరావతి,(ఉషశ్రీ)జూన్ 2: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొట్టుకుపోయిన తుంగభద్ర డ్యాం 19వ గేటు స్థానంలో స్టాప్ లాగ్ గేట్ ఏర్పాటు చేసి, భారీ వరదల సమయంలో సుమారు 80 టీఎంసీల నీటిని కాపాడగలిగామని తెలిపారు. దీంతో రాయలసీమ ప్రాంతానికి సాగు, తాగునీటి అవసరాలను తీర్చగలిగామని చెప్పారు. తుంగభద్ర బోర్డు చైర్మన్ ఎస్.ఎన్. పాండే, కార్యదర్శి ఓ.ఆర్.కె. రెడ్డి మంగళవారం సచివాలయంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును కలిశారు. ఈ సందర్భంగా తుంగభద్ర డ్యాం గేట్ల పునర్నిర్మాణం, నీటి నిర్వహణ తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ, . తుంగభద్ర గేట్లు ప్రమాదకర స్థితిలో ఉన్నాయని నిపుణులు గతంలోనే హెచ్చరించినప్పటికీ, గత ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. రాయలసీమ కరువు ప్రాంత అవసరాలను గుర్తించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో కేవలం ఆరు నెలల్లోనే కొత్త గేట్ల ఏర్పాటును పూర్తి చేసినట్లు వెల్లడించారు. నిపుణుడు కన్నయ్యనాయుడు సూచనల మేరకు 70 ఏళ్ల నాటి పాత గేట్ల స్థానంలో రూ.51 కోట్ల వ్యయంతో 33 కొత్త గేట్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఒకే సీజన్‌లో పాత గేట్లను తొలగించి కొత్త గేట్లను ఏర్పాటు చేయడం దేశంలోనే రికార్డుగా నిలిచిందన్నారు. ఈ నెలాఖరులో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల ముఖ్యమంత్రులు తుంగభద్ర డ్యాంలో ఏర్పాటు చేసిన కొత్త గేట్లను ప్రారంభించనున్నట్లు మంత్రి తెలిపారు. తుంగభద్ర ప్రాజెక్టు ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో 7.20 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతున్నట్లు పేర్కొన్నారు.

జూన్ 9న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సిద్ధాంతంలో పర్యటన ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి క్షేత్రస్థాయి పరిశీలన

పెనుగొండ: (ఉషశ్రీ) జూన్ 2: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈనెల 9వ తేదీన పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండ మండలం సిద్ధాంతంలో నిర్వహించనున్న పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొననున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేపడుతోంది. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఏర్పాట్లను మంగళవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పరిశీలించారు. జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మరియు సంబంధిత అధికారులతో కలిసి ముఖ్యమంత్రి హెలిపాడ్, బహిరంగ సభా స్థలి, వాహనాల పార్కింగ్ ప్రదేశాలను సందర్శించి ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా సభా ప్రాంగణంలో ప్రజలకు కల్పించాల్సిన సౌకర్యాలు, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లు, తాగునీరు, పారిశుద్ధ్యం, వైద్య సదుపాయాలు మరియు ఇతర మౌలిక సదుపాయాలపై అధికారులకు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అనంతరం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా చేపట్టాల్సిన భద్రతా చర్యలు, ప్రజల రాకపోకలు, వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ మళ్లింపు తదితర అంశాలపై అధికారులతో చర్చించి తగు ఆదేశాలు జారీ చేశారు. జిల్లా కలెక్టర్ వెంట జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, ఆర్డీవో దాసిరాజు, తహసీల్దార్ అనిత కుమారి, నరసాపురం డీఎస్పీతో పాటు వివిధ శాఖల అధికారులు వున్నారు.

సుజనా చౌదరి జన్మదినం సందర్భంగా దుర్గమ్మకు ప్రత్యేక పూజలు

ఇంద్రకీలాద్రి, (ఉషశ్రీ)జూన్ 2: విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ సుజనా చౌదరి జన్మదినం సందర్భంగా ఇంద్రకీలాద్రిపై వెలసిన శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీజేపీ నాయకులు, ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు అమ్మవారిని దర్శించుకుని ఎమ్మెల్యే సుజనా చౌదరి సంపూర్ణ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. అనంతరం వేసవి ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఇంద్రకీలాద్రికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక గొడుగుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. దుర్గగుడి డిప్యూటీ ఈఓ కిషోర్ కుమార్ సమక్షంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. భక్తులు ఎండదెబ్బకు గురికాకుండా సురక్షితంగా అమ్మవారి దర్శనం చేసుకునేందుకు ఈ ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎ. శ్రీరామ్, శ్రీధర్, ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు ఆవూరి శ్రీనివాస్, ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

లాటరైట్ గనుల వర్గీకరణపై కేంద్రానికి సీఎం చంద్రబాబు లేఖ

అమరావతి, (ఉషశ్రీ)జూన్ 2: లాటరైట్ ఖనిజ వర్గీకరణలో కేంద్ర ప్రభుత్వం ఇటీవల చేసిన మార్పుల వల్ల ఆంధ్రప్రదేశ్‌లో గనుల లీజుల ప్రక్రియ స్తంభించిపోయిందని పేర్కొంటూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డికి లేఖ రాశారు. లాటరైట్‌లో అల్యూమినియం శాతం 20 శాతం లేదా అంతకంటే ఎక్కువ ఉంటే దానిని ఉప ఖనిజంగా కాకుండా బాక్సైట్‌గా పరిగణించాలని కేంద్రం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయం కారణంగా రాష్ట్రంలో గతంలో మైనర్ మినరల్ కింద ప్రాసెస్ చేసిన 402 గనుల లీజు దరఖాస్తులను తాత్కాలికంగా నిలిపివేయాల్సి వచ్చిందని సీఎం వివరించారు. నిలిచిపోయిన దరఖాస్తుల్లో 19 లెటర్ ఆఫ్ ఇంటెంట్ దరఖాస్తులు, 113 ప్రభుత్వ భూముల దరఖాస్తులు, 255 అటవీ భూముల దరఖాస్తులు, 15 పట్టా భూముల దరఖాస్తులు ఉన్నాయని లేఖలో పేర్కొన్నారు. పాత నిబంధనల ప్రకారం దరఖాస్తు ఫీజులు చెల్లించడం, భూముల కొనుగోళ్లు, అటవీ అనుమతుల కోసం వందలాది మంది దరఖాస్తుదారులు ఇప్పటికే కోట్లాది రూపాయలు ఖర్చు చేశారని సీఎం తెలిపారు. గతంలో మైకా, క్వార్ట్జ్, ఫెల్డ్‌స్పార్, బారైట్స్ ఖనిజాలను మైనర్ నుంచి మేజర్ ఖనిజాలుగా మార్చినప్పుడు కేంద్ర ప్రభుత్వం సేవింగ్ క్లాజ్ అమలు చేసిందని గుర్తు చేసిన చంద్రబాబు, అదే తరహాలో లాటరైట్ ఖనిజానికి కూడా సేవింగ్ క్లాజ్ వర్తింపజేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న 402 దరఖాస్తులను పాత నిబంధనల ప్రకారమే మరో రెండేళ్లపాటు ప్రాసెస్ చేసేందుకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సడలింపు వల్ల వందలాది మంది దరఖాస్తుదారులకు ఆర్థిక నష్టం తప్పడంతో పాటు కోర్టు వివాదాలు తలెత్తకుండా ఉంటాయని సీఎం పేర్కొన్నారు. అలాగే సిమెంట్, ఐరన్ ఓర్, రోడ్డు నిర్మాణ రంగాలకు అవసరమైన ముడిసరుకు కొరత లేకుండా ఉండటంతో పాటు ఉపాధి అవకాశాలు కూడా కొనసాగుతాయని లేఖలో వివరించారు.

జూన్ 9న రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా పర్యటనను విజయవంతం చేయాలి :జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశాలు

భీమవరం: (ఉషశ్రీ)జూన్ 2: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జూన్ 9న జిల్లా పర్యటన సందర్భంగా ఎటువంటి లోటుపాట్లు లేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. ఈ నెల 9వ తేదీన ఆచంట నియోజకవర్గంలోని సిద్ధాంతంలో ముఖ్యమంత్రి పాల్గొననున్న పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి సంబంధించి మంగళవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి కలెక్టరేట్ పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లు సమర్థవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంపై అన్ని శాఖలు ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి పర్యటన తొమ్మిదో తేదీ ఉదయం 11.00 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు ఉంటుందని, తొలుత గ్రామ సభలో పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ, 56 అంశాలపై ఐవిఆర్ఎస్ సమాచారం ఆధారంగా ప్రజల సానుకూల స్పందనలో మొదటి పది స్థానాలు మరియు దిగువ పది స్థానాల్లో ఉన్న శాఖల పనితీరుపై సమీక్ష, పార్టీ కేడర్ మీటింగ్, పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులతో ముఖాముఖి కార్యక్రమాలు ఉంటాయన్నారు. ప్రజల సానుకూల స్పందనపై ఆయా శాఖాధికారులు పూర్తిస్థాయి సమాచారం, తాజా గణాంకాలతో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ముఖ్యంగా విద్యుత్, గృహ నిర్మాణం, ప్రజా రవాణా శాఖలు సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ఆచంట నియోజకవర్గంలో గత మూడు వారాలుగా నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమాల్లో ప్రజల నుంచి అందిన ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని, పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు.ముఖ్యమంత్రి పాల్గొనే బహిరంగ సభ, హెలిపాడ్, వాహనాల పార్కింగ్ ఏర్పాట్లలో ఎటువంటి లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసే ఎగ్జిబిషన్‌లో జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చే వరి ఉప ఉత్పత్తులు, స్థానిక ఫుడ్ ప్రొడక్ట్స్ తదితర అంశాలతో ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. సభకు హాజరయ్యే ప్రజలు, రైతులు, మహిళలకు అల్పాహారం, భోజనం, తాగునీరు, పారిశుద్ధ్యం, వైద్య సదుపాయాలు వంటి అంశాల్లో సంబంధిత శాఖలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా విధులు నిర్వహించే అధికారులు, సిబ్బందికి ప్రత్యేక గుర్తింపు కార్డులు జారీ చేయాలని కూడా ఆదేశించారు. ఈ సమావేశంలో డీపీఓ వై. దోసిరెడ్డి, డ్వామా పీడీ కె.సి.హెచ్. అప్పారావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్. వెంకటేశ్వరరావు, జిల్లా పరిశ్రమల అధికారి యు. మంగపతిరావు, డీసీహెచ్ పి. సూర్యనారాయణ, ఎల్‌డీఎం నాగేంద్రప్రసాద్, డీఎంహెచ్ఓ జి. గీతాబాయి, సీపీఓ కె. శివపార్వతి, స్వర్ణ గ్రామ--స్వర్ణ వార్డు అధికారి ఎ. వెంకటలక్ష్మి మరియు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

20 విడతలుగా నిర్వహించిన రెవిన్యూ క్లినిక్ ల ద్వారా 433 దరఖాస్తులు పరిష్కారం

భూ సమస్యల పరిష్కారంలో సత్వర మార్గాన్ని చూపుతున్న రెవెన్యూ క్లినిక్స్

భీమవరం: (ఉషశ్రీ) జూన్ 2 రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారానికి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ క్లినిక్స్ ఉత్తమ ఫలితాలను అందిస్తున్నాయని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికతో పాటు భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా రెవెన్యూ క్లినిక్స్ నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. 2025 డిసెంబర్ 29న ప్రారంభమైన రెవెన్యూ క్లినిక్స్ ద్వారా 2026 జూన్ 1 వరకు మొత్తం 20 విడతలుగా కార్యక్రమం నిర్వహించామని కలెక్టర్ తెలిపారు. ఈ కాలంలో జిల్లావ్యాప్తంగా మొత్తం 755 దరఖాస్తులు అందగా, వాటిలో 286 దరఖాస్తులను పరిష్కరించడం జరిగిందన్నారు. అర్హతలు, నిబంధనల ప్రకారం 147 దరఖాస్తులను తిరస్కరించగా, ప్రస్తుతం 322 దరఖాస్తులు వివిధ దశల్లో పరిష్కార ప్రక్రియలో ఉన్నాయని వివరించారు. డివిజన్ వారీగా పరిశీలిస్తే భీమవరం డివిజన్ పరిధిలోని ఏడు మండలాల్లో 327 దరఖాస్తులు అందగా, వాటిలో 121 దరఖాస్తులు పరిష్కరించబడినట్లు తెలిపారు. 60 దరఖాస్తులు తిరస్కరించగా, మరో 146 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని చెప్పారు. నరసాపురం డివిజన్ పరిధిలోని ఎనిమిది మండలాల్లో 273 దరఖాస్తులు అందగా, 111 దరఖాస్తులను పరిష్కరించామని, 52 దరఖాస్తులను తిరస్కరించామని, మరో 110 దరఖాస్తులు పరిష్కార దశలో ఉన్నాయని వెల్లడించారు. తాడేపల్లిగూడెం డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో 155 దరఖాస్తులు అందగా, 54 దరఖాస్తులను పరిష్కరించామని, 35 దరఖాస్తులను తిరస్కరించామని, మిగిలిన 66 దరఖాస్తులపై విచారణ కొనసాగుతోందన్నారు. భూ సమస్యలపై అందిన ప్రతి ఫిర్యాదును సమగ్రంగా పరిశీలించి, భవిష్యత్తులో ఎటువంటి వివాదాలు తలెత్తకుండా శాశ్వత పరిష్కారం అందించే దిశగా

చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. రెవెన్యూ క్లినిక్స్ ద్వారా ప్రజలకు త్వరితగతిన పరిష్కారాలు లభిస్తున్నాయని, ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

సునీల్ కుమార్ వ్యాఖ్యలపై విచారణ చెయ్యాలి: రఘురాం కృష్ణంరాజు

కాళ్ళ:(ఉషశ్రీ) జూన్ 2 సిఐడి మాజీ చీఫ్, సీనియర్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్ పై ఏపీ డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణంరాజు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భీమవరంలో జరిగిన ఓ సమావేశంలో అనవసరంగా ఆయన మాట్లాడారని ధ్వజమెత్తారు. పీవీ సునీల్ కుమార్ వ్యాఖ్యలపై పోలీసులు విచారణ చేపట్టాలని సూచించారు. 4000 ఎస్సీ ఎస్టీ కేసులపై చార్జిషీట్ వేయించానని ఆయన ఎలా మాట్లాడాలని ప్రశ్నించారు. సి బి సి ఐ డి కి ఎస్సీ, ఎస్టి అట్రాసిటీ కేసులకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. సంచలమైన కేసులు ఉంటే తప్ప 200 కేసులకు మించి తీసుకోవడానికి వీల్లేదని చెప్పారు. 4000 కేసుల్లో చాటి సీటు వేయించానని పివి సునీల్ కుమార్తెగించి మాట్లాడడం విడ్డూరంగా ఉందని రఘురామకృష్ణంరాజు విమర్శించారు. తన కస్టోడియల్ టార్చర్ కేసులో ఆయన పాత్ర ఉందని క్లియర్ గా అర్థమైందని చెప్పారు. షార్ట్ సీట్లు వేయడంలో ఆయనకి సంబంధం ఏమిటనే విషయం పై పోలీసులు విచారణ చేయాలని సూచించారు. భీమవరంలో జరిగిన సమావేశానికి జాన్ మార్క్ అని వ్యక్తి ఢిల్లీ నుంచి వచ్చి మాట్లాడారని చెప్పారు. ఆయన సమావేశంలో మాట్లాడుతూ వాళ్లను వేసేయాలని ,వీళ్ళని వేసేయాలని పిచ్చిపిచ్చిగా మాట్లాడాలని ధ్వజమెత్తారు. మంచి ప్రభుత్వం అని చెప్పి హింసను ప్రేరేపిస్తూ పిచ్చిగా మాట్లాడే వారిపై చర్యలు తీసుకుంటారా? లేదా? అనేది ఈ ప్రభుత్వం విచక్షణకే వదిలేస్తున్నానని రఘురామ కృష్ణంరాజు పేర్కొన్నారు.

మెరిట్ విద్యార్థులకు ప్రశాంతి పట్నాయక్ చేతులమీదుగా ప్రతిభ పురస్కారాలు

తగరపువలస, ఉష శ్రీ : 10 వ తరగతి, ఇంటర్మీడియేట్ లలో ప్రతిభ కనబర్చిన 160 మంది విద్యార్థులకు భీమిలి నియోజకవర్గం వైఎస్సార్ సీపీ మహిళా అధ్యక్షురాలు, రాష్ట్ర శిష్ట కారణాల మహిళా అధ్యక్షురాలు డబ్బీరు ప్రశాంతి పట్నాయక్ చేతులమీదుగా నగదు, ప్రతిభ పురస్కారాలు అందచేశారు. విశాఖ డాబాగార్డెన్స్ పరిదిలో గల ప్రేమ సమాజం స్కూల్ నందు గల కంచర్ల అన్నపూర్ణ దేవి ఆడిటోరియం లో శిష్ట కరణం ఫౌండేషన్ ఆధ్వర్యంలో "2026 ప్రతిభా పురస్కారాల వేడుకలు" ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం కి మానాపురం సురేష్ అధ్యక్షత వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రశాంతి పట్నాయక్ మాట్లాడుతూ ప్రతిభా పురస్కారం అనేది కేవలం ఒక జ్ఞాపిక లేదా సర్టిఫికేట్ మాత్రమే కాదని, అది మీ నిరంతర శ్రమకు సమాజం ఇస్తున్న గుర్తింపు అన్నారు. మున్ముందు మీరు సాధించాల్సిన విజయాలకు ఇది ఒక కొత్త ఉత్సాహాన్ని ఇవ్వాలని అన్నారు. విద్యార్థి దశలో ఏకాగ్రత, క్రమశిక్షణ, నిరంతర కృషే మిమ్మల్ని ఉన్నత శిఖరాలకు చేరుస్తుందని అన్నారు. తల్లిదండ్రుల త్యాగాలు, మీ గురువుల మార్గదర్శకత్వం, మన మూలాలను, మన సమాజాన్ని ఎప్పటికీ మర్చిపోవద్దని చెప్పారు. శిష్ట కారణం ఫౌండేషన్ ప్రతి ఏటా ఇలాంటి అద్భుతమైన కార్యక్రమాల ద్వారా మన సమాజంలోని ఆణిముత్యాలను గుర్తించి ప్రోత్సహించడం చాలా అభినందనీయమని, మీ భవిష్యత్తు మరింత ఉజ్వలంగా ఉండాలని, మీరు మన సమాజానికి, దేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని విద్యార్థులను ఉద్దేశించి అన్నారు.

మానాపురం సురేష్ మాట్లాడుతూ డబ్బీర్ ప్రశాంతి పట్నాయక్ అంటే అందరికి ముందు గుర్తుకు వచ్చేది సమాజం లో అనాథులు కు, వికలాంగుల వృద్ధాప్య శరణాలయలకు అందించిన సేవలు, పేద మధ్య తరగతి విద్యార్థులు విద్య కు అందించిన సహాయం గుర్తు కు వస్తాయని అని కొనియాడారు. భీమిలి తో పాటు విశాఖ జిల్లా లో ఆమె అందించిన ఎన్నో సేవలు ఎనలేనివని తెలిపారు. ఈ కార్యక్రమం లో కొప్పిలి శ్రీకాంత్,శేఖర్ మహంతి శ్రీనివాసరావు, మానాపురం తిలక్ పట్నాయక్, గంట్రేటి వెంకట భాస్కర్రావు, చంద్ర మహంతి గిరిష్ పట్నాయక్, అమరా విశ్వేశ్వరరావు, కంటి మహంతి కాంచన రావు తథితరులు పాల్గొన్నారు.

ఏఐ సాంకేతికతతో చిన్నారుల ఆరోగ్య సమస్యల ముందస్తు గుర్తింపు

- అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు మెరుగుదలకు ప్రత్యేక కార్యాచరణ
- స్మార్ట్ ముస్తాబ్–హెల్తీ బాయ్, హెల్తీ గర్ల్ పోటీల నిర్వహించండి
- జిల్లా కలెక్టర్ డా. ఎన్. ప్రభాకర రెడ్డి

పార్వతీపురం, ఉష శ్రీ ప్రతినిధి జి ఎస్ ఆర్ సి హెచ్ మూర్తి జూన్ 2 : చిన్నారుల ఆరోగ్య సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి వారికి సకాలంలో వైద్య సేవలు అందించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ డా. ఎన్. ప్రభాకర రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కలెక్టరేట్‌లోని పి.జి.ఆర్.ఎస్ హాల్‌లో మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన "0–6 సంవత్సరాల పిల్లలకు ఏఐ ఆధారిత ఈసీడీ స్క్రీనింగ్" జిల్లా స్థాయి రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి భాస్కరరావు, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ కనకదుర్గ, డా. జగన్మోహన్‌లతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన కలెక్టర్, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా పిల్లల ఎదుగుదలలో లోపాలు, పోషకాహార సమస్యలు, ఆరోగ్య సంబంధిత ఇబ్బందులను ముందుగానే గుర్తించడం సాధ్యమవుతుందని తెలిపారు. ఈ సాంకేతిక విధానాలపై క్షేత్రస్థాయి సిబ్బందికి పూర్తి అవగాహన కల్పించడం ద్వారా చిన్నారులకు మరింత మెరుగైన సేవలు అందించవచ్చన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల పనితీరును మెరుగుపరచేందుకు సిబ్బందిని పనితీరు ఆధారంగా ఏ, బీ, సీ కేటగిరీలుగా వర్గీకరించి వెనుకబడిన కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. పోషణ్ ట్రాకర్ డేటాను విశ్లేషించి సమస్యలను గుర్తించి పరిష్కరిస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు. పిల్లల హాజరు శాతాన్ని వంద శాతానికి చేర్చేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, కేంద్రాలకు రాని చిన్నారుల తల్లిదండ్రులకు అవసరమైతే కౌన్సిలింగ్ నిర్వహించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల శారీరక, మానసిక వికాసానికి ఆటలు, వ్యాయామాలు తప్పనిసరిగా నిర్వహించాలని చెప్పారు. జిల్లాలోని అన్ని కేంద్రాల్లో ఒకే విధమైన క్రీడా కార్యక్రమాలను అమలు చేసి పిల్లల్లో ఆరోగ్యకరమైన అలవాట్లు పెంపొందించాలన్నారు. పిల్లల శారీరక దృఢత్వాన్ని పెంపొందించేందుకు హ్యాంగింగ్, స్కిప్పింగ్, రన్నింగ్, జంపింగ్ వంటి వ్యాయామాలను ప్రోత్సహించాలని సూచించిన కలెక్టర్, ప్రతి నెల "స్మార్ట్ ముస్తాబ్ -- హెల్తీ బాయ్, హెల్తీ గర్ల్" పోటీలను నిర్వహించి ఆరోగ్యవంతమైన పిల్లలను ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం యాప్ ఆధారిత స్క్రీనింగ్ విధానం సులభమని, సిబ్బంది దానిపై పూర్తిస్థాయిలో అవగాహన పెంపొందించుకుని సమర్థవంతంగా అమలు చేయాలని పిలుపునిచ్చారు. అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి జిల్లాలో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ఐసీడీఎస్ అధికారులు, సూపర్వైజర్లు, సీడీపీఓలు, అంగన్‌వాడీ కార్యకర్తలు మరియు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కరవు నేలలో పచ్చని విప్లవం

- నీటి చుక్కతో పచ్చని భవిష్యత్‌ను నిర్మించుకున్న ఆ గ్రామం నేడు ఎందరో రైతులకు నిజమైన స్ఫూర్తి!
- జిల్లా కలెక్టర్ చొరవతో కోటసీతారాంపురం రైతులు సాధించిన విజయం

పార్వతిపురం ఉష శ్రీ ప్రతినిధి జి ఎస్ ఆర్ సి హెచ్ మూర్తి జూన్ 2:- ఒకప్పుడు తాగునీటికి సైతం అల్లాడిన ఆ ఊరు.. నేడు పచ్చని పంటలతో, సిరులతో కళకళలాడుతోంది. ఎండమావుల నేలగా మారిన ఆ గ్రామం జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి చూపిన చొరవతో ఇప్పుడు జిల్లాలోనే ఒక ఆదర్శవంతమైన విజయగాథగా నిలిచింది. అదే పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం మండలంలోని కోటసీతారాంపురం గ్రామం. ఒకప్పుడు కరవు కోరల నుంచి నేడు ఆ గ్రామ రైతులు సాధించిన అద్భుత ప్రగతి ప్రయాణం ఇది. కొన్నేళ్ల క్రితం వరకు కోటసీతారాంపురం అంటే కరవుకు, వలసలకు కేరాఫ్ అడ్రస్. నీటి కొరత వల్ల వ్యవసాయం సాగక, ఉపాధి దొరక్క ఊర్లోని యువతంతా హైదరాబాద్, విశాఖపట్నం వంటి మహా నగరాలకు వలస బాట పట్టేవారు. ఉన్న ఊరిని వదిలి, కూలీలుగా మారడం ఆ గ్రామ ప్రజల జీవితాల్లో నిత్యకృత్యమైంది. ఇటువంటి తరుణంలో జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి చూపిన చొరవతో గ్రామ ముఖచిత్రమే పూర్తిగా మారి మరేందరికో ఆదర్శంగా నిలిచింది.

మలుపు తిప్పిన కలెక్టర్ చొరవ: గ్రామస్తులు పడుతున్న కష్టాలను చూసి స్పందించిన జిల్లా కలెక్టర్, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని సంకల్పించారు. ఆయన ఆదేశాలతో భూగర్భ జల శాఖ అధికారులు గ్రామంలో సమగ్ర సర్వే నిర్వహించారు. శాస్త్రీయ పద్ధతుల్లో భూగర్భ జలాలు ఉన్న ప్రాంతాలను గుర్తించి, పది బోరుబావులు తవ్వించగా.. వాటిలో ఎనిమిది బోర్లు విజయవంతంగా నీటిని అందించాయి. దీంతో ఆ ఊరి దశాబ్దాల నీటి కరవుకు బ్రేక్ పడింది.

ఆధునిక సాంకేతికత.. బిందు సేద్యం: నీరైతే వచ్చింది కానీ, దాన్ని వృథా చేయకుండా ఎలా సద్వినియోగం చేసుకోవాలో తెలియని రైతులకు ప్రభుత్వం ద్వారా రైతులకు మార్గదర్శనం చేసింది. ప్రభుత్వం అందించిన సబ్సిడీ సాయంతో రైతులు బిందు సేద్యం విధానాన్ని ఎంచుకున్నారు. ఈ పద్ధతి ద్వారా తక్కువ నీటితోనే ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసే అవకాశం దక్కింది.

పుచ్చకాయ సాగుతో యువ రైతుల సంచలనం: వలసల నుంచి తిరిగి వచ్చిన యువ రైతులు సాంప్రదాయ పంటల జోలికి వెళ్లకుండా, మార్కెట్లో డిమాండ్ ఉన్న వాటర్ మిలన్ (పుచ్చకాయ) సాగుపై దృష్టి సారించారు. ఆధునిక పద్ధతులు, పట్టుదల తోడవ్వడంతో కేవలం మూడు నెలల వ్యవధిలోనే (డిసెంబర్ నుంచి ఫిబ్రవరి) ఎకరానికి సుమారు 20 టన్నుల రికార్డు స్థాయి దిగుబడిని సాధించి అందరినీ ఆశ్చర్యపరిచారు. దాంతో వలస వెళ్లిన యువకులు నేడు స్వగ్రామంలోనే సొంతంగా వ్యవసాయం చేస్తూ లక్షల్లో ఆదాయం సంపాదిస్తున్నారు. తాము ఆర్థికంగా నిలదొక్కుకోవడమే కాకుండా, ఊర్లోని మరికొంతమందికి స్థానికంగానే ఉపాధి కల్పిస్తున్నారు. చీకటిలో ఉండే తమ జీవితాలను వెలుగులోకి మార్చిన జిల్లా కలెక్టర్‌కు, గ్రౌండ్ వాటర్ మరియు వ్యవసాయ శాఖ అధికారులకు రైతులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నారు. ప్రభుత్వ ప్రోత్సాహం, అధికారుల సరైన ప్రణాళిక, రైతుల పట్టుదల కలిస్తే కరవు నేలనైనా సస్యశ్యామలం చేయవచ్చని కోటసీతారాంపురం నిరూపించింది.

ఇంద్రకీలాద్రిపై అమ్మవారిని దర్శించుకున్న దర్శకుడు హను రాఘవపూడి

విజయవాడ, జూన్ 2: రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'ఫౌజీ' దర్శకుడు హను రాఘవపూడి మంగళవారం విజయవాడలోని ఇంద్రకీలాద్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన శ్రీ కనకదుర్గమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనం అనంతరం ఆలయ అర్చకులు వేదాశీర్వచనం అందజేసి అమ్మవారి తీర్థప్రసాదాలను అందించారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన హను రాఘవపూడి, ప్రభాస్ కథానాయకుడిగా రూపొందుతున్న 'ఫౌజీ' చిత్రం షూటింగ్ శరవేగంగా సాగుతోందని తెలిపారు. ఇప్పటికే సినిమా చిత్రీకరణ 80 శాతం పూర్తైందని, మిగిలిన భాగాన్ని కూడా త్వరలో పూర్తి చేసి ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం ఈ చిత్రంపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయని, చిత్ర బృందం అత్యున్నత ప్రమాణాలతో సినిమాను రూపొందిస్తోందని ఆయన పేర్కొన్నారు.

చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు..

విశాఖపట్నం, జూన్ 2, ఉష శ్రీ విశాఖపట్నం జిల్లా వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రెండేళ్లుగా చంద్రబాబు దుర్మార్గ, రాక్షస, అరాచక పాలనను ప్రజలకు తెలియజేసే "వెన్నుపోటుకు రెండేళ్ళు" పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం విశాఖపట్నం జిల్లా పార్టీ అధ్యక్షుడు కె.కె రాజు ఆధ్వర్యంలో జరిగింది. ఈసమావేశంలో సమన్వయకర్తలు తిప్పల దేవన్ రెడ్డి ,మొల్లి అప్పారావు, తిప్పల నాగిరెడ్డి ,నియోజకవర్గ పరిశీలకులు పసుపులేటి బాలరాజు ,తైనాల విజయ్ కుమార్ ,రొంగలి జగన్నాధం ,జహీర్ అహ్మద్ ,రాష్ట్ర ,మాజీ జిల్లా వివిధ కార్పొరేషన్ చైర్మన్లు ,మాజీ జీవీఎంసీ కార్పొరేటర్ ,రాష్ట్ర పార్టీ కార్యవర్గం సభ్యులు నగర జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు,రాష్ట్ర అనుబంధ విభాగాల కమిటీ సభ్యులు ,మాజీ రాష్ట్ర జిల్లా వివిధ కార్పొరేషన్ డైరెక్టర్ ,వార్డు అధ్యక్షులు,ముఖ్య నాయకులు ,సీనియర్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

3 ఏళ్ళ కుమార్తె తో తల్లి అదృశ్యం

భీమునిపట్నం, ఉష శ్రీ: మధురవాడ మిథిలాపురి వుడాకాలనీలో ఒకే కుటుంబానికి చెందిన తల్లి, కుమార్తె అదృశ్యం కావడం తో పి. ఎం. పాలెం పోలీస్ స్టేషన్ లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఐటీ సెజ్ ఉద్యోగి అయిన షేక్ రసూల్ సోమవారం మధ్యాహ్నం ఆఫీసుకు వెళ్లి, సాయంత్రం 5:40 గంటలకు ఇంటికి వచ్చేసరికి తలుపు తాళం వేసి ఉంది. లోపల వెతకగా...తన కోసం వెతకవద్దని భార్య షేక్ షాహీన్ బాను (22) రాసిన లేఖ లభ్యమైంది. ఆమె తన 3 ఏళ్ల కుమార్తె షేక్ రహీమాతో కలిసి ఇల్లు వదిలి వెళ్లినట్లు రసూల్ గుర్తించారు. ఆమె మొబైల్ స్విచ్ ఆఫ్ వస్తోంది.?భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు పీ.ఎం.పాలెం పిఎస్ సీఐ జి.బాలకృష్ణ ఆదేశాలతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో ఏఎస్ఐ సింహాచలం మృతి

భీమునిపట్నం, ఉష శ్రీ: ఆనందపురం పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ చల్లా సింహాచలం మంగళవారం ఉదయం గుండెపోటుతో అకస్మాత్తుగా మరణించారు. మధురవాడ, నగరంపాలెం రోడ్ నివాసి అయిన ఆయన ప్రస్తుతం ఐటీ సెజ్ శక్తి టీమ్ ఇన్‌ఛార్జ్‌గా విధులలో ఉన్నారు.? గత వారం రోజులుగా సెలవులో ఉన్న ఆయనకు ఈ ఉదయం ఒక్కసారిగా తీవ్ర అనారోగ్యం (గుండెపోటు) రావడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. అయితే ఆయన అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. భీమిలి, మధురవాడ, ఆనందపురం పరిసర ప్రాంతాల్లో సుపరిచితుడైన సింహాచలం మృతి పట్ల స్థానిక పోలీసులు, ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

డొక్కా సీతమ్మ భోజన పథకం వంట సహాయకులకు శిక్షణ

తగరపువలస, ఉష శ్రీ: డొక్కా సీతమ్మ మధ్యాహ్నబడి భోజన పథకం వంట సహాయకులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని భీమునిపట్నం లోని రెండవ వార్డ్ జి.వి. యం.సి ఆదర్శ ప్రాథమిక పాఠశాల లో నిర్వహించారు. వంట సహాయకులకు శిక్షణ నిమిత్తం వంట సహాయకులలో ఒకరైన రమాదేవి విజయవాడలోని శిక్షణ పొంది ఇక్కడ మండలంలోని అందరూ వంట సహాయకులకు శిక్షణ ఇచ్చారు. విద్యార్థులకు వడ్డించేటప్పుడు శుచి, శుభ్రత పాటించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా మధ్యాహ్నం భోజన పథక సమన్వయకర్త పొట్నూరు మురళీమోహన్రావు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథక ఆవశ్యకత గురించి వివరించారు. మండల విద్యాశాఖ అధికారులు ఎం. శివరాణి, డి. శ్రీనివాసరావు లు మాట్లాడుతూ నిర్ణయించిన కార్యక్రమ మెనూ ప్రకారం అన్ని జరగాలని విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సిహెచ్ .నంద గోపాల్ మరియు పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

పుట్టినరోజు సందర్భంగా సేవా కార్యక్రమం నిర్వహించిన డాక్టర్ జగన్ మోహన్

పార్వతీపురం ఉష శ్రీ ప్రతినిధి జి.ఎస్ ఆర్ సిహెచ్ మూర్తి, జూన్ 2 : ఆర్.బి.ఎస్.కె జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్ మోహనరావు మంగళవారం తన పుట్టినరోజు సందర్భంగా అందుబాటులో ఉన్న అనాథలకు నిత్యావసర వస్తు రూపంలో చేసే దానం కొంతలో కొంత ఆదుకుంటుందని సదుద్దేశంతో పార్వతీపురం మునిసిపల్ రాయగడ రోడ్డు శివారున గల జట్టు ఆశ్రమంలో అనాథ పిల్లలకు రిఫండ్ ఆయిల్, కందిపప్పు, మినప,శనగ పప్పులు, నిత్యావసర సరుకులు, బిస్కెట్లు అందజేశారు. వారితో కొద్ది సేపు మాట్లాడి అక్కడ పిల్లల ఆరోగ్య స్థితి గతుల తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన పుట్టినరోజు సందర్భంగా ప్రతి సంవత్సరం ఆనవాయితీగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అనాథలకు, పేదలకు సేవ చేయడం ఎంతో సంతృప్తినిస్తుం దన్నారు. అలాగే తన స్వగ్రామమైన సీతానగరం మండలం బూర్జ గ్రామంలో వృద్ధులకు గొడుగులను పంచిపెట్టారు. కార్యక్రమంలో జట్టు ఆశ్రమ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు తో శివాని జన్మదిన వేడుకలు

భీమునిపట్నం, ఉష శ్రీ: మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు మనవరాలు, డాక్టర్ ప్రియాంక–శ్రావణ్ ల కుమార్తె చిన్నారి శివాని జన్మదిన వేడుకలు మంగళవారం భీమిలిలోని ఎస్ ఓ ఎస్ పాఠశాలలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు చిన్నారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. శివాని జన్మదినాన్ని పురస్కరించుకుని అవంతి విద్యాసంస్థల ప్రతినిధి ముత్తంశెట్టి మహేష్, కళాశాల డైరెక్టర్లు ఎ. చంద్రశేఖర్, విశ్వప్రసాద్ చేతుల మీదుగా పాఠశాల విద్యార్థులకు లంచ్ బాక్స్ బ్యాగులు, నోట్ పుస్తకాలు, పెన్నులు, ఇతర విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల డైరెక్టర్లు మాట్లాడుతూ.. మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు ఎస్ ఓ ఎస్ పాఠశాలతో ఎన్నో ఏళ్లుగా విడదీయరాని అనుబంధం ఉందన్నారు. వారి కుటుంబంలో ఏ శుభకార్యం జరిగినా మొదటగా ఈ పాఠశాల విద్యార్థుల మధ్యే జరుపుకోవడం ఒక ఆనవాయితీగా వస్తోందని గుర్తుచేశారు. విద్యాసంస్థల అధినేతగా పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందాలని, వారు చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నదే ఆయన నిరంతర తపన అని కొనియాడారు. ఈ సేవా కార్యక్రమంలో అవంతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పిన్నింటి రామకృష్ణ, ఫిజికల్ డైరెక్టర్ కోలా చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరిలో టిడిపి ఎమ్మెల్యేల వర్క్ షాప్... పాల్గొన్న ఎమ్మెల్యే ఉగ్ర

ఉష శ్రీ పామూరు ప్రతినిధి రజియా సయ్యద్ మంగళగిరితెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం(ఎన్టీఆర్ భవన్)లో నిర్వహించిన పార్టీ ఎమ్మెల్యేల వర్క్ షాప్ అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. పార్టీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ కార్యక్రమానికి హాజరై ఎమ్మెల్యేలకు దిశా నిర్దేశం చేశారు. రాబోయే రోజుల్లో అనుసరించాల్సిన రాజకీయ వ్యూహాలు, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ తదితర అంశాలపై ప్రజా ప్రతినిధులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజా ప్రతినిధులు కేవలం అసెంబ్లీ లేదా కార్యాలయానికి పరిమితం కాకూడదని, నిరంతరం ప్రజల్లో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించాలని సీఎం స్పష్టం చేశారు. “ ఏ ఎన్నికలు వచ్చిన గెలవడమే మన ప్రాథమిక లక్ష్యం” అని చంద్రబాబు తేల్చి చెప్పారు. నాయకులను పార్టీ గౌరవిస్తుందని, అయితే ప్రజల్లో ఆదరణ లేకపోతే మాత్రం ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వంలో భాగంగా జనసేన, బిజెపి నాయకులతో కలిసి సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఎమ్మెల్యే పనితీరుల నిరంతరం సమీక్షిస్తామని, తప్పులు చేస్తే సహించేది లేదని కరాఖండిగా చెప్పారు. ఈ వర్క్ షాప్ లో లభించిన శిక్షణ ద్వారా ప్రజా పాలనను మరింత సమర్థవంతంగా, అవినీతికి తావు లేకుండా క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలని అధిష్టానం ఎమ్మెల్యేలకు సూచించింది. ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు శాసనసభ్యులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి కి మండల మహిళా ప్రధాన కార్యదర్శి రజియా శుభాకాంక్షలు

ఉష శ్రీ పామూరు ప్రతినిధి రజియా సయ్యద్ తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం నారా చంద్రబాబు నాయుడు గారి సమర్థవంతమైన నాయకత్వంలో అధికారంలోకి వచ్చి, నేటికీ దిగ్విజయంగా రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పామూరు మండల తెలుగుదేశం పార్టీ మహిళా ప్రధాన కార్యదర్శి రజియా సయ్యద్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ఆమె ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రజియా మాట్లాడుతూ.. గత రెండేళ్లలో కాలంలో సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయని కొనియాడారు. ముఖ్యంగా ‘సూపర్ సిక్స్’ పథకాల ద్వారా మహిళలకు ఆర్థిక భరోసా దొరికిందని, మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఆమె పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో తెలుగుదేశం పార్టీ నాయకత్వంలో రాష్ట్రం మరింత ప్రగతి పథంలో ముందుకు తీసుకెళ్లాలని, ప్రజలకు సంక్షేమ పాలన మరింత చేరువ కావాలని ఆకాంక్షిస్తూ సీఎం నారా చంద్రబాబు నాయుడుకి పార్టీ శ్రేణులకు ఆమెఅభినందనలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో స్థానిక టిడిపి నాయకులు మహిళ కార్యకర్తలు కూడా ఉన్నారు.

కనీస వేతనం 26 వేల రూపాయలతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలి

సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు కొల్లి సాంబమూర్తి ఆశ వర్కర్లు రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్

పార్వతిపురం ఉష శ్రీ ప్రతినిధి జి.ఎస్ ఆర్ సిహెచ్ మూర్తి జూన్ 2:- పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడ మండలానికి సంబంధించి మాదిలింగి కొమరాడ కూనేరు రామభద్రపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేయుచున్న ఆశ వర్కర్లకు మరియు కమ్యూనిటీ వర్కర్లకు కనీస వేతనం 26000 తో పాటు అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరుతూ ఈరోజు అనగా మంగళవారం కొమరాడ మాదలింగి కూనేరు రామభద్రపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు వద్ద నిరసన కార్యక్రమాలు చేయడం జరిగింది నిరసన అనంతరం డాక్టర్ పి అనుపు గారికి వినతిపత్రం ఇవ్వడం జరిగింది ఈ నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆశ వర్కర్ల యూనియన్ నాయకులు పార్వతి హైమ సుమ గంగ మరియు కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల నాయకులు దుర్గ మరియు సిఐటియు మండల నాయకులు కొల్లి సాంబమూర్తి మాట్లాడుతూ ఈరోజు రాష్ట్ర ప్రభుత్వం కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు గాను ఆశ వర్కర్లకు గాను పని భారం విపరీతంగా పెంచి రాత్రి పగలు తేడా లేకుండా కష్టపడి పని చేస్తున్నప్పటికీ కూడా కనీస వేతనం లేదు ఉద్యోగ భద్రత లేదు రాజకీయ వేధింపులు పెరిగాయి రకరకాల యాప్ లను తెచ్చి ఇబ్బంది పెట్టే పరిస్థితి ఉంది కాబట్టి ఇలాంటి సందర్భంలో లికూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు ఆశ వర్కర్లకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించి పని భారం తగ్గించి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అమలు చేసి అన్ని రకాల ఆదుకోవాలని సిఐటియుగా డిమాండ్ చేస్తున్నాం లేనియెడల రాష్ట్రవ్యాప్తంగా ఈ పోరాటాన్ని ఉధృతం చేస్తామని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేయుచున్నాము ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్లు కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు పాల్గొన్నారు

నెల్లిచెరువు గట్టు ఎస్సీ కాలనీలో కాంగ్రెస్ వార్డు బాట

- కాంగ్రెస్ ను గెలిపించండి పార్వతీపురాన్ని కాపాడండి
- నెల్లిచెరువు గట్టు నివాస్తులకు ఇల్లు నిర్మించి ఇవ్వాలి
- నెల్లిచెరువును ఆక్రమణల నుండి రక్షించాలి
- ఇటీవల చెరువును కప్పిన మట్టిని తీసివేయాలి
- నెల్లిచెరువు గట్టు నివాసితులకు మౌలిక సదుపాయాలు కల్పించాలి
- ఎస్సీ సామాజిక వర్గం నుండి నాయకులు ముందుకు రావాలని కోరిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

పార్వతీపురం ఉష శ్రీ ప్రతినిధి జి.ఎస్ ఆర్ సిహెచ్ మూర్తి జూన్2:- పార్వతీపురం మున్సిపాలిటీలోని 21వ వార్డులో గల కాలనీలో భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ నాయకులు వార్డుబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ డిసిసి జిల్లా అధ్యక్షులు వంగల దాలినాయుడు, ఎస్సీ సెల్ కోఆర్డినేటర్ కోలాకిరణ్ కుమార్, ఓబీసీ చైర్మన్ సిరిసిపల్లి సాయి శ్రీనివాస్, పార్వతీపురం మండల అధ్యక్షులు బంకురు ప్రకాష్, పట్టణ అధ్యక్షులు గంట మోహన్ రావు, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు గొట్టాపు రేణుక, పట్టణ అధ్యక్షురాలు బసవ వసుంధర తదితరులు వార్డులో పర్యటించి ఇంటింటికి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేధావులు మౌనంగా ఉంటే మూర్ఖులు వ ం ం ని ్ర ఎా లి ట ి ని పరిపాలిస్తారన్నారు. కాంగ్రెస్ ని గెలిపించి పార్వతీపురాన్ని రక్షించాలని పిలుపునిచ్చారు. ఏ సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి తాము కృషి చేస్తామన్నారు. తల్లి లాంటి పాలన అందించే కాంగ్రెస్ ను స్వాగతించాలన్నారు. మన ఊరిని మనం బాగు చేసుకునేందుకు ముందుకు రావాలన్నారు. ఎస్సీ సామాజిక వర్గం నుండి యువత నాయకులుగా ఎదగాలన్నారు. ఆసక్తి ఉన్నవారికి కాంగ్రెస్ పార్టీ అవకాశం ఇస్తుందన్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో వార్డు నుండి పోటీ చేసేందుకు ముందుకు రావాలన్నారు. ఎవరికో ఓట్లు వేసి ఐదేళ్లపాటు వారి చుట్టూ తిరిగే కంటే నెల్లిచెరువుగట్టునుండే ఓ నాయకుడు ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందాలని కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు పలు సమస్యలను కాంగ్రెస్ పార్టీ నాయకులు దృష్టికి తీసుకువచ్చారు. ప్రధానంగా ఇటీవల మున్సిపల్ అధికారులు మున్సిపల్ చెత్త డంపింగ్ యార్డ్ నుండి చెత్తను తెచ్చి చెరువులో పోసి కప్పటం వల్ల, ఏమాత్రం వర్షం పడినా తమ ఇళ్లల్లోకి నీరు వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పాములు విష పురుగులు బారిన పడుతున్నామన్నారు. రహదారి సదుపాయం లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. తమకు ఇచ్చే స్థలాలలో ఇల్లు నిర్మాణాలు చేసేందుకు ఆర్థికంగా లేకపోవడంతో పూర్తిస్థాయిలో ఇళ్ల నిర్మాణాలు చేయలేకపోయామన్నారు. పారిశుద్ధ్య పనులు, ఇళ్ల పనులు చేసుకుంటూ బతుకుతున్న తాము పక్కా ఇల్లు నిర్మించుకునే పరిస్థితి లేదన్నారు. కాబట్టి ప్రభుత్వమే తమకు ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నారు. అంతవరకు తమ నివాసాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. తమకు దివంగత ప్రధాని ముఖ్యమంత్రి ఇందిరమ్మ, వైయస్ రాజశేఖర్ రెడ్డి పాలనలో రిక్షాలతోపాటు పలు సంక్షేమ పథకాలను అందజేశారని ఈ సందర్భంగాగుర్తు చేసుకున్నారు. మళ్లీ కాంగ్రెస్ పార్టీ పాలన వస్తేనే హరిజన, గిరిజన, మైనారిటీ, బడుగు బలహీన వర్గాలకు మేలు జరుగుతుందని ఆశాభావాన్ని వ్యక్తం చేస్తారు. ఈ సందర్భంగా ఏ సమస్య వచ్చినా తాము అండగా ఉంటామని కాంగ్రెస్ పార్టీ నాయకులు వారికి భరోసా ఇచ్చారు. ఇంటింటికి వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకుని, కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించడం జరిగిందన్నారు.

విజయవాడలో రాష్ట్ర సదస్సు ను జయప్రదం చేయండి?

పార్వతిపురం ఉష శ్రీ ప్రతినిధి జి ఎస్ ఆర్ సి హెచ్ మూర్తి జూన్ 2:- పార్వతిపురం మున్సిపల్ కార్యాలయం దగ్గర కార్మికులను ఉద్దేశించి ఆ సంఘం గౌరవ అధ్యక్షులు సిఐటియు కోశాధికారి గొర్లి వెంకటరమణ మాట్లాడుతూమున్సిపల్ రంగంలో 14 కీలక విభాగాలను పబ్లిక్, ప్రైవేటు పార్టనర్ షిప్ (పిపిపి) పద్ధతిలో పౌరసేవలను ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టే చర్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడనాడాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తున్నది. ప్రైవేటీకరణ విధానాలను నిరసిస్తూ జూన్ 4వ తేదీ విజయవాడలో జరుగుతున్న రాష్ట్ర సదస్సుకు మున్సిపల్ రంగంలోని అన్ని సెక్షన్ల కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ 48 వేల కోట్ల రూపాయల నోటు బడ్జెట్ తో ఉన్నట్లు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ.ఆర్.టి నెంబర్ 975లో పేర్కొన్నది. వనరుల పరిరక్షణ, స్వావలం భన సాధించడానికి ప్రధానమంత్రి ఆత్మ నిర్భరత మార్గదర్శకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన కార్యాచరణ ప్రణాళిక మున్సిపల్ ఉద్యోగులు కార్మికుల్లో అభద్రత నెలకొల్పే దిశగా ఉందని మునిసపల్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ విమర్శించింది. ఇందన పొదుపు, దుబారా ఖర్చుల నివారణ వంటి చర్యలను ఏపీ మున్సిపల్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ స్వాగతిస్తుంది. కానీ ఆ పేరుతో ఉద్యోగులు, కార్మికుల హక్కులను హరిస్తే మాత్రం సహించేది లేదని ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వ విధానాల మూలంగా మున్సిపల్ రంగంలో పని చేస్తున్న వేలాది మంది డ్రైవర్లు, క్లీనర్లు, మెకానిక్ లు, క్లాప్ డ్రైవర్లు, మంచినీటి సరఫరా, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, స్ట్రీట్ లైటింగ్, పార్కులలో పని చేసే కార్మికుల ఉపాధిపైన, హక్కులపైన తీవ్ర ప్రభావం చూపే అవకాశాలున్నాయని రాష్ట్ర కమిటీ ఆందోళన వ్యక్తం చేస్తున్నది. ఈ నేపథ్యంలో జూన్ 4వ తేదీ ఉదయం 10:30 గంటలకు విజయవాడలో రాఘవయ్య పార్కు సమీపంలో గల బాలోత్సవ్ భవన్ లో రాష్ట్ర సదస్సు జరుగుతుంది. ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్సీ కె యస్. లక్ష్మణరావు హాజరవుతున్నారు. మున్సిపల్ రంగంలోని అన్ని కేటగిరీల కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని సదస్సును జయప్రదం చేయవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం. అన్నారు ఈ కార్యక్రమంలో గాంధీ, కొండ, రాము, కుమార్ తదితరులు పాల్గొన్నారు

ఘనంగా ఓపెన్ షూటింగ్ కాంపిటేషన్

విశాఖపట్నం, జూన్ 2, ఉష శ్రీ : ఇటీవలే ఎంవిపి కాలనీ పరిధిలో జరిగిన అర్జున్ స్పోర్ట్స్ షూటింగ్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓపెన్ షూటింగ్ కాంపిటీషన్ అత్యంత ఘనంగా జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన షూటర్లు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కాంపిటీషన్‌లో మొత్తం సుమారు 200 మంది వరకు పాల్గొనగా, బాయ్స్ మరియు గర్ల్స్, రైఫిల్ మరియు పిస్టల్ విభాగాలను కలిపి మొత్తం 23 కేటగిరీలలో పోటీలు నిర్వహించబడ్డాయి. ఈ పోటీల్లో 11 సంవత్సరాల చిన్న వయస్సు నుండి 47 సంవత్సరాల వరకు ఉన్న షూటర్లు తమ ప్రతిభను ప్రదర్శించారు. ప్రత్యేకంగా, శ్రీకాకుళం నుండి నెల్లూరు వరకు సుమారు 10 జిల్లాల నుంచి క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనడం విశేషం. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడల శాఖ వంత్రి ఉదయం కార్యక్రమంలో భాగంగా అర్జున్ స్పోర్ట్స్ షూటింగ్ అకాడమీ టీ-షర్ట్‌ను లాంచ్ చేయడంతో పాటు పోటీలను అధికారికంగా ప్రారంభించారు. అలాగే సాయంత్రం జరిగే కార్యక్రమంలో విజేతలకు మెడల్స్ ప్రదానం చేయడానికి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. మెడల్ డిస్ట్రిబ్యూషన్ కార్యక్రమం మే 31, 2026 సాయంత్రం 5:30 గంటలకు రామ్‌నగర్‌లోని ఎలిగెంట్ హోటల్‌లో జరుగనుంది. పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగి, పాల్గొన్న క్రీడాకారులు ఉన్నత స్థాయి ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. పాల్గొన్న షూటర్లు మాట్లాడుతూ, "ఈ పోటీలు రాబోయే లిలిజూన్ 20 నుండి హైదరాబాద్‌లో ప్రారంభమయ్యే స్టేట్ చాంపియన్‌షిప్‌కు ముందు సరైన ప్రాక్టీస్ మరియు ఎక్స్‌పోజర్ ఇచ్చాయి" అని అభిప్రాయం వ్యక్తం చేశారు. అర్జున్ స్పోర్ట్స్ షూటింగ్ అకాడమీ డైరెక్టర్ గారు మాట్లాడుతూ, "ఈ తరహా పోటీలు యువతలో షూటింగ్ క్రీడపై ఆసక్తిని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. రాష్ట్రంలోని ప్రతిభావంతమైన షూటర్లను గుర్తించి, వారిని జాతీయ మరియు అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడమే మా లక్ష్యం" అని తెలిపారు.

షార్ట్ న్యూస్ వెర్షన్ విజాగ్: అర్జున్ స్పోర్ట్స్ షూటింగ్ అకాడమీ నిర్వహించిన ఓపెన్ షూటింగ్ కాంపిటీషన్‌లో రాష్ట్రవ్యాప్తంగా నుండి సుమారు 200 మంది షూటర్లు పాల్గొన్నారు. శ్రీకాకుళం నుండి నెల్లూరు వరకు సుమారు 10 జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. బాయ్స్, గర్ల్స్, రైఫిల్ మరియు పిస్టల్ విభాగాల్లో మొత్తం 23 కేటగిరీలలో పోటీలు నిర్వహించగా, 11 నుండి 47 సంవత్సరాల వయస్సు గల క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రీడల పోటీలను ప్రారంభించారు. పాల్గొన్న షూటర్లు ఈ పోటీలు జూన్ 20 నుంచి హైదరాబాద్‌లో జరిగే స్టేట్ చాంపియన్‌షిప్‌కు ముందు మంచి ఎక్స్‌పోజర్ ఇచ్చాయని తెలిపారు.

వైఎస్సార్ సీపీ లో గుర్తింపు లేని చిల్ల హరి

భీమునిపట్నం, ఉష శ్రీ: అవంతి హయాంలో వైఎస్సార్ సీపీ కి ఎనలేని సేవలు అందించిన చిల్ల హరికి ప్రస్తుతం పార్టీ లో గుర్తింపు కరువైంది. భీమునిపట్నం మండలం తాళ్లవలస పంచాయతీ ఎంపీటీసీ అభ్యర్థి "చిల్ల హరి" గత కొన్ని రోజులుగా పార్టీపై అసంతృప్తితో ఉన్న విషయం తెలిసిందే. గత పంచాయతీ ఎన్నికలలో తాళ్లవలస ఎంపీటీసీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. తర్వాత పార్టీ పరంగా ఎలక్షన్లు ముందు గాని తర్వాత గాని పంచాయతీలో ఎటువంటి కార్యక్రమాలు జరిగినా ముందు స్థానంలో చిల్ల హరి అనే వ్యక్తి ఉండేవాడు. ప్రతి కార్యక్రమానికి తన సొంత డబ్బులు ఖర్చు పెట్టి ఆ యొక్క కార్యక్రమాన్ని విజయవంతం చేసేవారు. నియోజకవర్గం లో వైఎస్సార్ సీపీ ఓటమి తర్వాత పార్టీ కి అవంతి రాజీనామా చేసిన తర్వాత ఇంచార్జి గా చిన్న శ్రీను ని పార్టీ అధ్యక్షులు నియమించిన సంగతి తెలిసిందే. అయితే చిన్న శ్రీను నాయకత్వం లో భీమిలి లో వైఎస్సార్ సీపీ కి మళ్ళీ ఉత్సాహం వచ్చింది. పార్టీ కి అనేక రకాలుగా సేవలు అందించిన చిల్ల హరి అసంతృప్తితో ఉన్న నేపథ్యంలో తనని కనీసం ఏం జరిగింది అని పార్టీ పెద్దలు గానీ జగన్మోహన్ రెడ్డి ఎంపిక చేసినటువంటి నియోజకవర్గం ఇంచార్జ్ చిన్న శ్రీను గాని అడిగింది లేదు. పార్టీని నమ్ముకుని ఉన్నటువంటి చిల్ల హరిని గుర్తించకపోవడం బాధాకరమైన విషయం. తన స్వంత పంచాయితీ లో జరుగుతున్న కార్యక్రమాలు గాని, పార్టీ కార్యక్రమాలు గాని హరి కి తెలియపరచడం లేదు. పార్టీ కోసం పనిచేసి అసంతృప్తి తో ఉన్న నాయకులను బుజ్జగించి పార్టీ లో కలుపుకుని పోతే పార్టీ మరింత బలోపేతం అయ్యే అవకాశాలు ఉంటాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

ఉపాధి హామీ పనుల తనిఖీ : కూలీలకు మెరుగైన సౌకర్యం కల్పించాలి : మన్నశీ రమణయ్య

ఉష శ్రీ పామూరు ప్రతినిధి రజియా సయ్యద్ పామూరు మండలంలో కంబాలదిన్నె గ్రామపంచాయతీలొ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న అభివృద్ధి పనులను మంగళవారం కంబాలదిన్నె గ్రామ పార్టీ అధ్యక్షులు మన్నం రమణయ్య ఆకస్మికంగా పరిశీలించారు. ఈ పర్యటనలో భాగంగా కంబాలదిన్నె లొ జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. కూలీలు చేస్తున్న పనితీరును, పని ప్రదేశాలలో కల్పిస్తున్న మౌలిక వసతులను ఆయన స్వయంగా తనిఖీ చేశారు. ఉపాధి హామీ కూలీలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని పని ప్రదేశంలో టెంట్లు, మంచినీరు, ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు, ప్రథమ చికిత్స కిట్లను అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. చేపడుతున్న అభివృద్ధి పనులలో ఎటువంటి అవకతవకలకు తావు లేకుండా నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా పెద్ద ఎత్తున ఖర్చు చేస్తుందని, పేద కూలీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు

వ్యాపారుల సేవా తత్పరతకు లయన్స్ క్లబ్ గుర్తింపు

సామాజిక స్పృహ, సేవా గుణం కల వారిని గుర్తించడంలో లయన్స్ క్లబ్ ముందుంటుంది అని కంభం లయన్స్ క్లబ్ సర్వీస్ చైర్ పర్సన్, మాజీ జడ్పీటీసీ సయ్యద్ జాకీర్ హుస్సేన్ పేర్కొన్నారు... స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో కొందరు వ్యాపారులు వారి దుకాణాల ఆవరణలో స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వేసవి కాలంలో ప్రజల దాహార్తి తీర్చే సదుద్దేశంతో చల్లని మంచి నీటి క్యాన్ లను ఏర్పాటు చేసి తమ సామాజిక స్పృహను చాటారు... ఈ నేపథ్యంలో పెయింట్ దుకాణం నిర్వహించే పోలిశెట్టి రమణ, మదన్ మోహన్ సోదరులు, చెప్పుల దుకాణం నిర్వహించే షేక్ నదీమ్ లను గుర్తించి, వారి సేవాగుణాన్ని ప్రోత్సహించేటందుకు కంభం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లయన్ బాల రంగారావు ఆధ్వర్యంలో క్లబ్ సభ్యులు వారిని శాలువాలతో సత్కరించి అభినందించడం జరిగింది. ఇలాంటి వారికి లయన్స్ క్లబ్ లు ఆదరిస్తాయని క్లబ్ సభ్యులు పేర్కొన్నారు... ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు కంభం లాయర్ మహబూబ్ బేగ్, వెంకట రావు, మండల కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ సలీమ్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి మండల సర్వసభ్య సమావేశం " నేడే "

చింతపల్లి , జూన్ 2, ఉష శ్రీ :- చింతపల్లిలో నేడు నిర్వహించే మండల సర్వసభ్య సమావేశానికి మండల స్థాయి అధికారులంతా పూర్తి సమాచారంతో హాజరుకావాలని ఎంపీపీ కోరాబు అనూష దేవి అన్నారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ సమస్యల గుర్తింపు పరిష్కార విషయంలో తీసుకోవలసిన చర్యలపై చర్చించే ప్రధాన ప్లాట్ ఫామ్ మండల సర్వసభ్య సమావేశం అన్నారు. ప్రజా ప్రతినిధులు అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో సమస్యలపై వాటి పరిష్కారానికి కృషి చేయవలసిన ఇటువంటి కార్యక్రమానికి కొన్ని శాఖల అధికారులు హాజరు కాకపోవడం దురదృష్టకరం అన్నారు. ఆ విధంగా రాని శాఖల అధికారుల కారణంగా మండలంలో అనేక సమస్యలు, సమస్యలుగానే ప్రతి సమావేశంలో చర్చించుకోవడం వలన ప్రజలకు తప్పుడు సంకేతం వెళు తుందన్నారు. ప్రతి మండల సర్వసభ్య సమావేశంలో అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నప్పటికీ చర్యలు తీసుకోక పోవడం వలన అధికారులు సమావేశాలకు డుమ్మా కొడుతున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారన్నారు. అటువంటి పరిస్థితులకు చెక్ పెట్టాలనే ఉద్దేశంతో నేడు నిర్వహించ తలపెట్టిన మండల సర్వసభ్య సమావేశంలో మండలంలోని అన్ని శాఖల అధికారులు విధిగా హాజరు కావాలని లేని పక్షంలో వారి తీరుపై కలెక్టర్ కు ఫిర్యాదు చేయడం జరుగుతుందని ఈ సందర్భంగా ఆమె హెచ్చరించారు.

పుష్పగిరి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం .

ఉష శ్రీ ప్రతినిధి సీతారామపురం మండలం (జూన్ 2) సీతారామపురంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఈనెల 4వ తేదీన పుష్పగిరి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. కంటి పరీక్షలు చేయించుకోదలచినవారు ఒరిజినల్ ఆధార్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు సెల్ నెంబర్ తో వైద్య శిబిరం కు రావాలన్నారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలు ఇస్తారని, అవసరమైన వారికి ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు చేయబడతాయని నిర్వహకులు తెలిపారు.

అభాగ్యులకు అండగా ఆర్థిక భరోసా.

ఉష శ్రీ ప్రతినిధి సీతారామపురం మండలం (జూన్ 2) మండలంలోని సింగారెడ్డి పల్లెలో కూరాకు బాల గురవయ్య కుమార్తె కూరాకు సాలమ్మకు ఉదయగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆదేశాల మేరకు మండల కన్వీనర్ చింతల శ్రీనివాసులు సూచనలు మేరకు మండల టిడిపి యువ నాయకులు కుర్రా రత్తయ్య యాదవ్ సదరు మహిళలకు మంగళవారం 15 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. కూరాకు సాలెమ్మ కు ప్రసవ సమయంలో కాలు చేయి పడిపోవడంతో ఉపాధి లేక ఇబ్బంది పడుతున్నారు. విషయం తెలుసుకున్న మండల టిడిపి నాయకులు వెంగళశెట్టి వెంకటేశ్వర్లు,ఆదెయ్య మరియు మండల టిడిపి తెలుగు యువత అధ్యక్షులు పసుపులేటి వికాస్ బాబు ,మండల టిడిపి ఉపాధ్యక్షుడు మాలకొండయ్య , పాణెం మురళీ,బబ్లు తదితరులు మహిళ నివాసానికి వెళ్లి ఆర్థిక సహాయం చేసి తమకు కావలసిన సహాయం చేస్తామని భరోసా ఇచ్చారు . మండలంలో టిడిపి నాయకులు ఎలాంటి ఆపద వచ్చిన వెనువెంటనే వెళ్లి ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం ప్రజలలో మంచి గుర్తింపు పొందుతున్నారని గ్రామస్తులు కొనియాడారు.

కనిగిరిలోని అమరావతి గ్రౌండ్ లో అంబేద్కర్ విగ్రహ డెవలప్మెంట్ కమిటీ సమావేశం

ఉష శ్రీ పామూరు ప్రతినిధి రజియా సయ్యద్ ఈనెల 6న కనిగిరిలో ఒంగోలు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు, కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆధ్వర్యంలో అంబేద్కర్ కాంస్య విగ్రహ ఆవిష్కరణ మహోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడి కార్యక్రమానికి కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్ మంత్రివర్యులు చిరాగ్ పాస్వాన్ రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు హాజరుకానున్నట్లు తెలిపిన కమిటీ సభ్యులు 25 వేల మందికి పైగా కార్యక్రమానికి ప్రజలు హాజరుకానున్నారని, గిన్నిస్ వరల్డ్ రికార్డులో కార్యక్రమం నమోదయ్యే విధంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపిన కమిటీ సభ్యులు కులాలు, మతాలకు అతీతంగా ప్రజలు తరలివచ్చి, మహనీయుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపు

రాష్ట్ర కోప్పల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ గోట్టాపు వెంకటనాయుడుకు జన్మదిన వేడుక

పార్వతీపురం ఉష శ్రీ ప్రతినిధి జి.ఎస్ ఆర్ సిహెచ్ మూర్తి
జూన్2:- రాష్ట్ర కొప్పల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గొట్టాపు వెంకట నాయుడు జన్మదిన వేడుక స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ముందుగా ఆయనతో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేయించి శు భాకాంక్షలు తెలిపారు. పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అందుబాటులో లేకపోవడంతో ఆయన గొట్టాపు వెంకటనాయుడుకు ఫోన్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఇటువంటి పుట్టిన రోజు వేడుకలు మరెన్నో చేసుకోవాలని, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పార్వతీపురం పట్టణానికి చెందిన పలువురు మాజీ కౌన్సిల్ సభ్యులు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

PRINTED, PUBLISHED, OWNED BY ILIPILLA MOHAN, D.NO: 6-11-2, KILARI APPALASWAMI STREET, NAGA LAKSHMI NILYAM, ANJANEYAVAGUSENTAR, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH- 520001, PRINTED AT GANTYADA APPA RAO D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH-523001 P.H: 92950 03377,EMAIL: ushasri2025@gmail.com,RNI NO: APTEL/25/A4894,EDITOR: ILLIPILLA MOHAN